జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP సంపుటి : 1 సంచిక: 132 సోమవారం 6 అక్టోబరు– 2025 పేజీలు : 8 వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

## తిరుమల తరహాలో శ్రీశైలం అభివృద్ధి

పుణ్యక్షేత్ర సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు
ఏటా లక్షల మంది భక్తులు వస్తున్నారు
తదనుగుణంగా వసతులు పెంచాలి
ప్రధాన రహదారులతో అనుసంధానం
2 వేల హెక్టార్ల అటవీ భూమి కేటాయించాలని కేంద్రాన్ని అడుగుదాం
ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా, పర్యావరణహితంగా తీర్చిదిద్దాలి: సీఎం
16న ప్రధాని పర్యటన ఏర్పాట్లపై ఉన్నతాధికారులకు సూచనలు
వర్చువల్‌గా పాల్గొన్న డిప్యూటీ సీఎం
శబరిమల, ఇతర ఆలయాలను పరిశీలించి అభివృద్ధి చేద్దామని పవన్ సూచన



అమరావతి, అక్టోబరు 5(సందేశం టైమ్స్) : తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో శ్రీశైల క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆదివారం ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో శ్రీశైలం అభివృద్ధిపై సమీక్షించారు. దేవదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వర్చువల్‌గా పాల్గొన్నారు. ఏటా లక్షల సంఖ్యలో శ్రీశైలం ఆలయానికి భక్తులు వస్తున్నందున మెరుగైన సదుపాయాలు ఎలా కల్పించాలి, మాస్టర్‌ప్లాన్, అటవీ శాఖ అంశాలపై సమావేశంలో చర్చించారు. ఆలయ అభివృద్ధికి 2 వేల హెక్టార్ల అటవీభూమి కేటాయించాల్సిందిగా కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని నిర్ణయించారు. ఈ నెల 16న ప్రధాని మోదీ శ్రీశైలానికి వస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లపై అధికారులకు సీఎం పలు సూచనలు చేశారు. ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా, పర్యావరణహితంగా అన్ని రకాలుగా ఈ పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేయాలని చెప్పారు. అందుకోసం ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ప్రధానంగా శ్రీశైలానికి జాతీయ రహదారులను అనుసంధానం చేసేలా ఈ ప్రణాళికలు ఉండాలన్నారు. భక్తులు పెరుగుతున్నందున ఆలయ సమగ్రాభివృద్ధికి సత్వర చర్యలు అవసరమని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా అభిప్రాయ పడ్డారు. ఇతర రాష్ట్రాల నుంచీ లక్షల సంఖ్యలో భక్తులు వస్తున్నందున సౌకర్యాలు విస్తరించా లన్నారు. శబరిమల, ఇతర ప్రముఖ దేవాల యాల్లో సౌకర్యాలు పరిశీలించి అభివృద్ధి చేద్దామని సూచించారు. శ్రీశైలాన్ని ఆదర్శప్రాయ యాత్రాస్థలంగా తీర్చిదిద్దేందుకు దేవదాయ, అటవీ, పర్యాటక శాఖల నడుమ సమన్వయం అవసరమన్నారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లపైనా అధికారులకు తగు సూచనలు చేశారు. ఆలయంలో మల్లికార్జునస్వామి దర్శనానికి భక్తులు వెళ్లేందుకు, బయటకు రావడానికి ఇప్పుడు ఒకే మార్గం ఉంది. బయటకు వచ్చేందుకు వేరే మార్గం ఏర్పాటుపైనా సమీక్షలో చర్చించారు.

## ఏపీపీఎస్సీలో లీకు వీరుడు!

- అనధికార సోషల్ మీడియాలో అధికారిక సమాచారం
- ముందే లీక్ చేస్తున్న కమిషన్ సభ్యుడు
- గోప్యంగా ఉంచాల్సిన విషయాలూ వెల్లడి
- అభ్యర్థుల అభిప్రాయాలు సేకరణ
- తాజా ర్యాంకింగ్ జాబితాలపై పోల్స్
- వైసీపీ హయాంలో సుధీర్ నియామకం
- జగన్‌కు సమీప బంధువనే ప్రచారం
- సర్వం తానే అన్నట్టుగా వ్యవహారం
- సర్కారుకు నిరుద్యోగుల సంఘం ఫిర్యాదు

అమరావతి, అక్టోబరు 5(సందేశం టైమ్స్) : లక్షలాది మంది నిరుద్యోగుల కలలను సాకారం చేసే రాజ్యాంగ బద్ధమైన సంస్థ ఏపీపీఎస్సీ. దీని నుంచి ఎలాంటి ప్రకటన వచ్చినా నిరుద్యోగులను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. ఇప్పటి వరకు ఏపీపీఎస్సీకి ఎలాంటి సోషల్ మీడియా ఖాతా లేదు. కానీ, కమిషన్ సభ్యుడు పరిగె సుధీర్ అత్యుత్సాహానికి పోయారు. తనే సొంతంగా ఓ టెలిగ్రామ్ గ్రూప్‌ను సృష్టించి.. ఏపీపీఎస్సీకి సంబంధించిన సమాచారాన్ని అనధికారికంగా ముందే వెల్లడిస్తున్నారు. అంతేకాదు.. అభ్యర్థుల నుంచి పలు కీలక విషయాలపై సమాచారం సేకరిస్తున్నారు. ఈ వ్యవహారంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. "గ్రూప్1, 2 ఫలితాలకు ముందు జనరల్ ర్యాంకింగ్ జాబితాలు విడుదల చేయాలా?. వద్దా?. గ్రూప్–2 అభ్యర్థులకు పోస్టు ప్రాధాన్యత ఎంపికకు మరో అవకాశం ఇవ్వాలా? వద్దా?. ఉద్యోగాల భర్తీలో కంప్యూటర్ ప్రొఫిషియన్సీ పరీక్ష ఎప్పుడు నిర్వహిస్తే బాగుంటుంది?. అపాయింట్‌మెంట్‌కు ముందా? తర్వాతా?." అంటూ.. టెలిగ్రామ్‌లో పోల్ నిర్వహిస్తున్నారు. అంతేకాదు ఏపీపీఎస్సీ ప్రకటించాల్సిన పలు అధికారిక నిర్ణయాలు ముందుగానే ఆయన టెలిగ్రామ్ గ్రూప్‌లో ప్రకటిస్తున్నారు. ప్రభుత్వానికి గోప్యంగా పంపే కీలక ప్రతిపాదనలనూ టెలిగ్రామ్‌లో పోస్ట్ చేస్తున్నారు. ఒక్కముక్కలో చెప్పాలంటే అనధికారికంగా ఆయన మరో వ్యవస్థను నడుపుతున్నారు. కమిషన్‌లో సభ్యుడిగా ఉంటూ ఇలా పోల్స్ నిర్వహించడం, అధికారిక నిర్ణయాలు, ప్రతిపాదనలను బహిర్గతం చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై నిరుద్యోగుల సంఘం ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వానికి ఫిర్యాదు చేసింది. మరోవైపు ఆయన నిర్వహిస్తున్న పోల్స్‌తో అభ్యర్థులు అయోమయానికి గురవుతున్నారు.

## తల్లికి వందనంతో జీఎస్టీ జోష్!




ఒకేసారి సొమ్ము అందడంతో ప్రజల్లో పెరిగిన కొనుగోలు శక్తి
చదువులకే కాకుండా గృహోపకరణాలు, సైకిళ్లు, బైకుల కొనుగోలుపై వ్యయం
కొందరు మరికొంత సొమ్ము కలిపి బంగారం కొన్న వైనం
దీంతో జీఎస్టీ వృద్ధి రెండింతలు
జూలై, ఆగస్టులో గణనీయ పెరుగుదల
జూన్ నెలలో వసూళ్లు 2,591 కోట్లు
తర్వాతి 2 నెలల్లో 2,977 కోట్లకు చేరిక

–అమరావతి/(సందేశం టైమ్స్)

కూటమి ప్రభుత్వం ఈ ఏడాది జూన్ 12న తల్లికి వందనం పథకం డబ్బులను లబ్ధిదారులైన తల్లుల ఖాతాల్లో వేసింది. దీనికి రూ.10,000 కోట్లకు పైగా ఖర్చు చేసింది. ఈ పథకం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం చూపుతోంది. ఈ పథకం అమలుచేసిన మరుసటి నెలలు జూలై, ఆగస్టుల్లో రాష్ట్ర జీఎస్టీ సాధారణం కంటే ఎక్కువగా పెరిగింది. వైసీపీ హయాంలో ప్రత్యక్ష నగదు బదిలీ(డీబీటీ)లు ఉన్నప్పటికీ.. అవి అర్హులకు ఒక్కసారిగా ఇంత ప్రయోజనం కలిగించలేదు. ఆ డబ్బు ఒక్కసారిగా కాకుండా ఏడాదికి కొంచెం చొప్పున పడడంతో అవి అప్పటి అవసరాలకు సరిపోయాయి. వాటితో ఏదైనా ఉపయోగపడే వస్తువు గానీ, బంగారం గానీ కొనే అవకాశం లేకుండా పోయింది. కానీ ఇప్పుడు తల్లికి వందనం పథకం ద్వారా లబ్ధిదారులకు ఒక్కసారిగా రూ.13 వేల నుంచి రూ.78వేల వరకు చేతికి రావడంతో వాటితో గృహోపకరణాలు, పిల్లలకు సైకిళ్లు, తమ జీవనోపాధికి ఆటోలు, గొర్రెలు, గేదెలు సైతం కొనుగోలు చేశారు. బైకులు, కొంత చేతిసొమ్ము కలిపి కాస్త బంగారం కొన్నవారు కూడా ఉన్నారు. దీంతో ప్రభుత్వానికి పన్ను రూపంలో ఆదాయం పెరిగింది. వైసీపీ హయాంలో ఇచ్చిన అమ్మఒడి పథకం కూడా కేవలం ఒక్క విద్యార్థికే ఇవ్వడం వల్ల ఆ డబ్బు స్కూలు ఖర్చులకు కూడా సరిపోయేది కాదు.

## ఉత్సవ శోభ

ఉత్సవాలను తిలకిస్తున్న మంత్రులు అనిత, శ్రీనివాస్, ఎమ్మెల్యేలు అదితి, పల్లా శ్రీనివాస్
ఘనంగా విజయనగర ఉత్సవాలు
ప్రారంభించిన మంత్రులు అనిత, శ్రీనివాస్
ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు
నగరంలో సందడే సందడి



విజయనగరం, అక్టోబరు 5 (సందేశం టైమ్స్) : విజయనగర ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవ ర్యాలీని మంత్రులు వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించారు. పైడిమాంబ ఆలయం నుంచి మూడులాంతర్ల మీదుగా కోట వరకు ర్యాలీ సాగింది. అక్కడ ఏర్పాటు చేసిన ప్రదర్శనలను మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు ఆసక్తిగా తిలకించారు. పైడిమాంబ అమ్మవారి కలశాలు, రోలర్ స్కేటర్స్, తప్పెటగుళ్లు, థింసా నృత్యాలు, కోలాటం, కేరళ వాయిద్యాలు, కర్రసాము, కత్తిసాము, అడుగుల బొమ్మలు, కొమ్ము, కోయ, బిందెల, గరగల డ్యాన్స్‌లు, చెక్క భజనలు, గంగిరెద్దులు, ఖాళీమాతా నృత్యాలు, ఒంటెల ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. మహిళలతో కలిసి మంత్రి అనిత, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు థింసా నృత్యం చేస్తూ సందడి చేశారు. చిన్నారుల యుద్ధ విన్యాసాలు అందరినీ ఆశ్చర్యపరిచాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఉత్సవాలు ప్రజల్లో మరింత ఉత్సాహం, ఉత్తేజాన్ని నింపాయి, పిల్లల నుంచి పెద్దల వరకూ వందలాది సంఖ్యలో ఉత్సవాలు తిలకించారు. ముఖ్యంగా విజయనగరం వైభవాన్ని చాటిచెప్పే పలు కార్యక్రమాలు, పైడిమాంబ అమ్మవారి కలశాల ప్రదర్శనతో భక్తుల్లో ఆధ్యాత్మికత సంతరించుకుంది. ఆదివారం రాత్రి అయోధ్య మైదానంలో జరగనున్న మ్యూజికల్ నైట్ కార్యక్రమం నిర్వహణకు ఆర్థికంగా సహకరించిన పలువురు దాతలను మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి సత్కరించారు.

## హామీలు బారెడు.. అమలు మూరెడు



అమరావతి, అక్టోబరు 5(సందేశం టైమ్స్) : ఆటో డ్రైవర్లను మోసం చేసిన వైసీపీ ప్రభుత్వానికీ, కూటమి సర్కారుకూ తేడాలేదని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు. గతంలో జగన్ 2.60 లక్షల మంది ఆటో డ్రైవర్లకు పదివేల రూపాయల చొప్పున ఇస్తే, కూటమి ప్రభుత్వం 2.90 లక్షల మందికి రూ.15 వేల చొప్పున ఇచ్చిందని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆటోడ్రైవర్లను మోసం చేయడంలో దొందూదొందేనని విమర్శించారు. బ్యాడ్జి ఉన్న ఆటో డ్రైవర్లకు ఏటా రూ.15 వేలు ఇస్తామని కూటమి నేతలు మోసం చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో బ్యాడ్జీ కలిగిన ఆటో డ్రైవర్లు 13 లక్షల మంది ఉంటే, జగన్ అందులో పదిశాతానికి లోపే(యజమానులకు) అమలు చేశారని, ఇప్పుడు చంద్రబాబూ అదే విధానం అమలు చేశారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు హామీలు బారెడుంటే, అమలు మాత్రం మూరెడేనని ఆరోపించారు. ఏ పథకాన్ని అమలు చేసినా సగంసగమేనని, అన్నింటా కోతలేనని ఆరోపించారు. ఆటో డ్రైవర్ అన్నలకు చంద్రబాబు చేసింది ఘరానా మోసమేనన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు, ఎన్నికల్లో ఊదర గొట్టిన ప్రసంగాలకు పొంతనే లేదని విమర్శించారు. కూటమి నేతలు ఖాకీ చొక్కాలు వేసుకుని, ఆటోల్లో తిరుగుతూ ఫొటోలకు పోజులిచ్చారని, డ్రైవర్ అన్నలకు మసిపూసి మారేడు కాయ చేశారని ఆరోపించారు.

## నకిలీ మద్యం.. ఇద్దరు టీడీపీ నేతలపై వేటు



అమరావతి/రాయచోటి, అక్టోబరు 5(సందేశం టైమ్స్) : అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం ములకల చెరువులో వెలుగు చూసిన నకిలీ మద్యం వ్యవహారంపై టీడీపీ అధిష్ఠానం సీరియస్ అయింది. ఈ విషయంలో టీడీపీ నాయకుల ప్రమేయంపై వివరాలు తెప్పించుకున్న టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు... ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఆదేశించారు. ఈ మేరకు తంబళ్లపల్లి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లె జయచంద్రా రెడ్డితో పాటు స్థానిక టీడీపీ నేత కట్టా సురేంద్ర నాయుడును పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ పల్లా ఆదివారం రాత్రి ప్రకటన విడుదల చేశారు.

### పిల్లుట్ల గ్రామంలో ఘనంగా

# నామకరణ మహోత్సవం

## ప్రముఖ బీసీ నాయకుల ఆశీర్వచనాలు

సందేశం టైమ్స్, సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి – అక్టోబర్ 05: మెదక్ జిల్లా పిల్లుట్ల గ్రామంలో ఈరోజు గందె ప్రభుశంకర్, గందె సంతోష్ కుమార్ గార్ల కుటుంబ సభ్యులు నిర్వహించిన పుట్టుపంచలు మరియు నామకరణ మహోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంఘ సేవకులు, బీసీ నాయకులు పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు బండారి గంగాధర్, బిజిఆర్ అధ్యక్షుడు కుమ్మరి నాగరాజు, బండారి సాయికిరణ్, గొల్లపల్లి పెద్ద నరసన్న, జనుముల గణేష్, మాజీ విద్యా కమిటీ చైర్మన్ పిల్లి మధు, హనుమాన్ సేన రాజిరెడ్డి, పిల్లి కృష్ణ, పిల్లి మధు, కర్రే శ్రీకాంత్ గౌడ్, శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున హాజరై కుటుంబ సభ్యులను అభినందించారు. సాంప్రదాయ బద్ధంగా జరిగిన ఈ వేడుకలో ఉత్సాహ వాతావరణం నెలకొంది.

# ప్రజావాణి కార్యక్రమం తాత్కాలికంగా రద్దు

## జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సందేశం టైమ్స్, సూర్యాపేట, అక్టోబర్ 5 :గ్రామ పంచాయతీ, జడ్పీటిసి, ఎంపిటిసి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నదానిప్రకారం, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగిసిన అనంతరం ప్రజావాణి కార్యక్రమాన్ని యథావిధిగా తిరిగి ప్రారంభిస్తామని తెలిపారు. జిల్లాలోని ప్రజలు తాత్కాలికంగా ఫిర్యాదులను సమర్పించడానికి ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి రాకూడదని ఆయన విజ్ఞప్తి చేశారు.

## నీట్ ప్రవేశ పరీక్షలో విజయం సాధించి ఎంబిబిఎస్ సీట్ సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానం



సందేశం టైమ్స్ నారాయణఖేడ్ ప్రతినిధి అక్టోబర్ 5: సంగారెడ్డిలో గల వైయస్సార్ భవన్ లోని సంగారెడ్డి జిల్లాబీసీ సంక్షేమ సంఘం తరపున ఎంబిబిఎస్ ప్రవేశ పరీక్షలు విజయం సాధించిన జంగం ధీరజ్ స్వామి, మఠం బిల్వ శ్రేష్ట, పట్లోళ్ల సుదీప, చల్మెడ మహాదేవ్ పడిశెట్టి శ్రావ్య మడపతి కాత్యాయని, నాయి కోటి కీర్తన లను మెమెంటోలను మరియు శాలువాలతో పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షులు ప్రభు గౌడ్ మాట్లాడుతూ డాక్టర్లు సంఘంలో చాలా ప్రధాన పాత్ర వహిస్తారు అలాగే వైద్య నారాయణ హరి అన్నారని పేర్కొన్నారు ముఖ్య అతిథు డాక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ మీరు కాబోయే డాక్టర్లు ఇక్కడికి ఆపకుండా ఎమ్మెస్ ఎండి చేసి మంచి భవిష్యత్తును సాధించగలరని మనస్ఫూర్తిగా నేను కోరుచున్నాను అని అన్నారు ప్రధాన కార్యదర్శి గోకుల్ కృష్ణ జిల్లా అధ్యక్షులు పట్లోళ్ల మల్లికార్జున్ ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ స్వామి ముక్య సలహాదారులు చంద్రయ్య స్వామి కార్యదర్శి సుధాకర్ గౌడ్, అధికార ప్రతినిధి మంగ గౌడ్ కార్మిక విభాగ అధ్యక్షుడు సుదర్శన్ పాల్గొన్నారు.

# MSc అగ్రికల్చర్ ర్యాంకర్ యమునకు సన్మానం



(సందేశం టైమ్స్)తమ్మర గ్రామం, కోదాడ మండలం (సెప్టెంబర్ 15):గత నెల సెప్టెంబర్ 15వ తేదీన విడుదల చేసిన అగ్రికల్చర్ M.Sc. ఎంట్రన్స్ టెస్ట్‌లో జాతీయ స్థాయిలో 104వ ర్యాంక్, అలాగే OBC కేటగిరీలో 49వ ర్యాంక్ సాధించిన తమ్మర గ్రామానికి చెందిన దేవరశెట్టి లక్ష్మి లక్ష్మినారాయణ దంపతుల కుమార్తె యమునను బీజేపీ పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర నాయకుడు కనగాల వెంకట రామయ్య గారు, "తల్లిదండ్రుల ప్రోత్సాహంతో యమున మంచి ర్యాంక్ సాధించడం గర్వకారణం. భవిష్యత్తులో తాను చేసే పరిశోధనల ద్వారా పర్యావరణ సంరక్షణకు కృషి చేయాలి" అని సూచించారు. కార్యక్రమంలో కోదాడ అసెంబ్లీ కన్వీనర్ కనగాల నారాయణ, కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెలివోలు చిట్టిబాబు,దేవరశెట్టి సత్యనారాయణ, బొల్లు కోటేశ్వరరావు, సజ్జ వెంకటేశ్వరరావు, కనగాల పుల్లారావు, సామా రవీందర్ రెడ్డి, కోటయ్య చౌదరి, యలగందుల నరసింహారావు తదితరులుపాల్గొన్నారు.

# దివంగత మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డికి ప్రముఖుల ఘన నివాళులు



(సందేశం టైమ్స్) సూర్యాపేట, అక్టోబర్ 4: మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అంత్యక్రియలు శనివారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలోని వ్యవసాయ క్షేత్రంలో అధికార లాంఛనాలతో నిర్వహించారు?. ఈ సందర్భంగా రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఇతర నేతలు, ఎమ్మెల్యేలు, మాజీ ప్రజాప్రతినిధులు, కేంద్ర రాష్ట్ర సంస్థల చైర్మన్లు, అధికారులు తదితరులు పార్టీలకతీతంగా హాజరై ఘనంగా నివాళులు అర్పించారు. ప్రజల సందర్శనార్థం శ్రీ దామోదర్ రెడ్డి పార్థివదేహాన్ని తన వ్యవసాయ క్షేత్రంలో ఉంచారు. రాష్ట్ర మంత్రివర్గ సభ్యులు, వివిధ జిల్లాల ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ నాయకులు, ప్రముఖులు, కుటుంబ సభ్యులుఅందరూ కలిసి పుష్పగుచ్ఛాలతో ఘన నివాళులు సమర్పించారు. ఫైనాన్స్ కమిషన్ చైర్మన్, పర్యాటక సంస్థ చైర్మన్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖులు మాజీ మంత్రి స్మృతిలో విషాదం వ్యక్తం చేశారు. ఆఖరిగా, అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించి, కుటుంబ సభ్యులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్.పి కే. నరసింహ, ఆర్డీఓ వేణుమాధవ్ తదితరులుపాల్గొన్నారు.

# ఘనంగా దుర్గామాత నిమజ్జనం

సందేశం టైమ్స్:సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి అక్టోబర్ 04తొమ్మిది రోజులపాటు నిత్య పూజలు అందుకున్న దుర్గామాత నిమజ్జనా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన కౌడిపల్లి లోని దుర్గ భవాని యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గామాత తొమ్మిది రోజులపాటు దీక్ష చేపట్టి తొమ్మిదవ రోజు శనివారం గ్రామంలో వీధులగుండ ఊరేగించారు. దుర్గామాత ముందు చిన్నారులు, మహిళలు, యువకులు పలు నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. వీరితో పాటు అలంకరణగ వేషధారణలో పలు నృత్యాలు చేశారు. ప్రతి సంవత్సరం దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తారు. తొమ్మిది రోజులపాటు నియమనిష్టలతో మాల ధరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ రోజు ఒక అలంకరణలో అలంకరిస్తారు. ప్రతిరోజు అమ్మవారి వద్ద తీర్థ ప్రసాదాలు భక్తులకు అందించారు. చివరి రోజు 9వ రోజు అంగరంగ వైభవంగా నిమజ్జల కార్యక్రమం నిర్వహించారు. నిమజ్జన కార్యక్రమంలో యూత్ సభ్యులుపాల్గొన్నారు.



## సదాశివపేట పట్టణంలో అంగరంగ వైభవంగా

# దుర్గాభవాని మాతా శోభయాత్ర



(సందేశం టైమ్స్):సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి అక్టోబర్ 04సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో తేది 4/10/2025 శనివారము రోజు నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా గత తొమ్మిది రోజులపాటు అనునిత్యం ప్రతిరోజు అమ్మవారు వివిధ రూపాలలో ప్రజలకు దర్శనమిస్తూ ప్రజలను ఎంతో ఉత్సాహబరితంగా పూజలు అందుకొని నిమజ్జనానికి చేసేందుకు భక్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎల్లప్పుడు సుఖసంతోషాలతో ఆయు ఆరోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. అంతేకాకుండా అమ్మవారి శోభయాత్ర ముందు పలు రకాల నృత్యాలు ,కోలాటాలు, జానపద గీతాలు పాడుతూ చిందులేశారు. ఈ ఆట పాటలను చూసేందుకు సదాశివపేట పట్టణం గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై వీక్షించారు .ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ అమ్మవారి శోభాయాత్ర అంగరంగ వైభవంగా కొనసాగింది .నిమజ్జనానికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలను పోలీసులు భద్రత ఏర్పాట్లు చేశారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి భద్రత ఏర్పాట్లు చేశారు .దీంతో అమ్మవారి నిమజ్జనం అంగరంగ వైభవంగా కొనసాగుతుందన్నారు.



# రూ.50 లక్షలతో దుర్గమ్మవారికి రథం





గోకవరం (సందేశం టైమ్స్): తూర్పుగోదావరి జిల్లా గోకవరంలోని దేవిచౌక్ ఆలయంలో మల్లేశ్వరస్వామి సమేత కనక దుర్గమ్మవారి ఊరేగింపునకు విశ్వ హిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు సుమారు రూ. 50 లక్షలతో రథం తయారు చేయించారు. దసరా ఉత్సవాల్లో పూజలు చేయించి శనివారం రథాన్ని ఆలయం వద్దకు చేర్చారు. సుమారు ఆరు నెలలపాటు పలువురు శిల్పులు శ్రమించి, 4 టన్నుల టేకు, 4 టన్నుల సోమిది కర్ర, 3 టన్నుల ఇనుముతో ర?థాన్ని చేయించామని చెప్పారు.

# సంపాదకీయం

## ఒక మత్తుకి ఇంకో మత్తు..మందు కాదు!

'ప్రాంతీయ అస్తిత్వం: భ్రమలూ, వాస్తవాలూ!' అన్న జూలై 29 నాటి నా వ్యాసానికి, 'తెలంగాణ పరిరక్షణ వేదిక' వారి సెప్టెంబరు 11 నాటి 'పాత సమాధానం" చూశాను. దానికి, నా వివరణ ఇదీ: (1) నాది 'పాచి వాదన' అనీ, 'ఆదర్శవాద ముసుగు' అనీ, 'ఆధిపత్య భావన' అనీ, 'పిడివాదన' అనీ వేదిక వారు అన్నారు. అసువంటి మాటలతోని, బహెస్ నడ్వది! కాబట్టి, గా ముచ్చట్లు ఇడిసిపెట్టి, అసల్ నేనేమంటీ, మీరేమంటున్రూ, గా సంగతి చెప్పుకోవాలె! (2) ఒక ప్రాంతంలో ఉన్న రకరకాల అసమానతల్నీ వైరుధ్యాల్నీ ప్రాంతీయ అస్తిత్వ స్పృహ అనే మాయ తెర కప్పివేస్తుంది అనే "ఎరుక మాకు తెలియనిది కాదు" అంటున్నరు వేదిక వాండ్లు! మరి, గా 'ఎరుక'తో నుండాలన్న నాతోని కొట్లాడుడేంది? (3) 'ఎమ్మార్పీఎస్ ఉద్యమం జేస్తున్నం! బీసీ రిజర్వేషన్ల ఉద్యమం జేస్తున్నం!' అని గొప్పలు చెప్పుకుంటున్రు! మోస్ట్ బ్యాక్వార్డ్ షెడ్యూల్ కులాల ఉద్యమాన్ని ఒప్పుకుంటున్రా? అసలు వర్గీకరణనే వ్యతిరేకించే మాల అస్తిత్వవాదుల ఉద్యమం సంగతేంది? "ముస్లింలు, స్త్రీలు, ఆదివాసీలు ఎవరైనా, అందరూ అన్ని పోరాటాలనూ చేయరు" అంటున్రు మీరు. అన్ని పోరాటాలు జయ్యమని ఈడ ఎవ్వరూ అడుగుతలేరు! తాము చేసే ఉద్యమాలు తాత్కాలిక ఉపశమనాన్ని కలిగించేవి మాత్రమేననీబీ భూములూ, గనులూ, ఫ్యాక్టరీలూ, రవాణా లాంటి ఉత్పత్తి సాధనాల్ని స్వాధీనం చేసుకోవాలనే దృష్టి లేకుండా, అసమాన శ్రమ విభజనని పూర్తిగా మార్చుకోవాలనే లక్ష్యం లేకుండా, చేసే యాడ్-హాక్ (తాత్కాలిక) ఉద్యమాలన్నీ, పాలకవర్గాలు ఏర్పాటు చేసిన చట్రంలో ఇరుక్కుపోవడమేననే స్పృహ లేకపోతే జరిగేదేమిటి? "గా ప్రాంతపోల్ల విగ్రహాలు, తీసెయ్యాలె! ఎన్నో సైన్మలు దీసిన మా ప్రాంతపోని ఫోటో గింత చిన్నగనా పెట్టేడిది? మా కార్మికుల శ్రమని దోచే హక్కు మా ప్రాంతపు కాంట్రాక్టర్లకె వుండాలె, గా ప్రాంతపు కాంట్రాక్టర్లకు కాంట్రాక్టులు ఎందుకీయాలె?" అంటే, అది తెలంగాణలోని శ్రామిక ప్రజల ప్రయోజనాలను ఏ రకంగా పరిరక్షిస్తుంది?(4) "మేం ప్రాంత అసమానత గురించి చేస్తున్నం. వర్గ ప్రాతిపదికన చేసే పోరాటానికి ఇవేవీ ఆటంకం కాదు" అని అంటున్రు వేదిక సాల్రు! నేనన్నదేంది? ఏ ప్రాంతాన్ని తీసుకున్నా, అది ఆంధ్రాగానీ, తెలంగాన గానీ, రాయలసీమ గానీ, గా ప్రాంతం అంతా ఒక్క తీరుగ లేదు. గా ప్రాంతాలల్ల, అమీరులున్నరు, గరీబులున్నరు. దొరలున్నరు, కూలోల్లున్నరు. మురికి అంటని కొలువులు జేసెటోల్లున్నరు, మురికి, సఫాయి పనులు జేసెటోల్లున్నరు. అందర్నీ, ఒక్కతీరుగనే జూస్తే, గది వర్గపోరాటానికి ఆటంకం కాదా? (5) "బి.ఆర్. బాపూజీ బాధ ఏమిటి?... తమ ప్రాంత ఆధిపత్యం మీద దృష్టి తగ్గుతది అనే" అంటున్నరు వేదిక సాల్రు! ఇగో సాల్రూ! ఈ బాపూజీ అనేటోనికి ఒక ప్రాంతమంటూ లేదు. వాడు ఆంధ్రోడూ కాదూ, తెలంగానోడూ కాదు! వాడు, కమ్యూనిస్టోడు! వాని భావజాలం 'శ్రామికవర్గ అంతర్జాతీయత'! అంటే, అన్ని దేశాల కార్మికులూ ఒక్కటిగావాలె! (6) "అంబేద్కర్ తదితరులు ప్రాంతాలకతీతంగా దేశం మొత్తానికీ ఐకన్స్" అని అంటున్నరు వేదిక వాండ్లు. అసలు గీ 'ఐకాన్స్' అనే ముచ్చటెక్కడికెల్లొచ్చింది? మనుషుల్ని 'ఐకన్స్' అనీ, 'వైతాళికులు' అనీ, సమానత్వ సూత్రానికి విరుద్ధంగా, నిలబెట్టడమే అసలైన 'ఆధిపత్య భావన!' (7) విగ్రహ తరలింపు ఉద్యమం ద్వారా, తెలంగాణను పరిరక్షించాలనుకుంటున్న వేదిక వారు, "మీ కాసు బ్రహ్మానందరెడ్డి, మీ ఎన్టీఆర్, మీ రాజశేఖరరెడ్డి, మా మర్రి చెన్నారెడ్డి, మా పి.వి. నరసింహారావు, మా అంజయ్య...!" అనుకుంట నా మీద కోపమైతాంద్రు. ఓ సాల్రూ! విగ్రహాలనేవీ సమానత్వ సూత్రానికి విరుద్ధమనీ, హేతువిరుద్ధమనీ, ఒక కళా రూపంగా మాత్రమే వాటిని చూడాలనీ, ఎవరి విగ్రహాన్నయినా చేసినా, చేయించినా, దాన్ని ప్రకృతి వైపరీత్యాలనించీ, సామాజిక శతృవులనించీ కాపాడుకోగలిగేలా, ఏర్పాట్లు చేసుకోవాలనీ చెపితే, 'గది మీ ప్రాంతపోని విగ్రహం! గిది మా ప్రాంతపోనిది!"- అని, గీ మాటలెందుకు జప్పుంద్రి! 8 రాజశేఖర్‌రెడ్డి పేరెత్తింద్రుగదా మీరు? మీకు యాదికున్నదో లేదో, ఒక ముచ్చట జప్తా ఇనుంద్రి! 2009లో తెలంగాణలో ఎన్నికల ప్రచారం అయినంక, రాయలసీమల ప్రచారం మొదలు బెట్టేతప్పుడు, "ప్రత్యేక తెలంగాణ వస్తే, రాయలసీమ వాళ్ళు, విదేశీయులుగా బతకవలిసి వస్తుందని" అన్నడు. అప్పుడు, నేను, గిదే బాపూజీని, 'ఆధిపత్య భావన' గలిగినోన్ని, గిట్ల రాసిన: "తన పాలనలో, సెజ్‌ల యజమానులకు ఆర్థికంగా, రాజకీయంగా, దళారీగా పనిచేసిన కాంగ్రెస్ పార్టీ నేతలలో అగ్రగణ్యుడైన ముఖ్యమంత్రి, ప్రత్యేక తెలంగాణ భూతాన్ని చూపడం మాత్రం, ఒక దళారీ దేశభక్తిని ప్రదర్శించడం లాంటిదే!" (ఆంధ్రజ్యోతి, 19-4-2009). (9) "ఆధిపత్య అహంకారానికి 'అస్తిత్వం మత్తే' సరైన జవాబు" అని వేదిక వాండ్ల ఆత్మ సమర్థన! కానీ, ఒక మత్తుకి ఇంకో మత్తు.. మందు కాదు! అస్తిత్వాలలో ఉప అస్తిత్వాలూ, ఉప-ఉప అస్తిత్వాలూ ఉన్నాయనీ, వాటి మధ్య అసమానతల్ని ఈ శ్రమ దోపిడీ సమాజం ప్రోత్సహిస్తుందనీ గ్రహింపు లేకపోతే ఎట్ల? (10) "తెలంగాణ స్ఫూర్తిదాతల విగ్రహాల లిస్ట్ కుల మత, లింగ భేదాల్ని బట్టి నిష్పత్తితో సహా సిద్ధంగా ఉంది" అని, ఐలాన్ జేసింద్రు వేదిక సాల్రు! ముందు, వర్గీకరణలోనూ, బీసీ రిజర్వేషన్లలోనూ నిష్పత్తులు తేలాలి గదా? అప్పుడే లిస్టు ఎట్ల సిద్ధంగున్నది? (11) "తెలంగాణ అస్తిత్వం మత్తు కాదు, అది భౌగోళిక విముక్తి" అంటున్నరు వేదిక వాండ్లు! భౌగోళిక శాస్త్రం ప్రకారం, తెలంగాణ ఒక ప్రాంతం కావచ్చు. కానీ, ఆర్థిక, రాజకీయ, సాంఘిక శాస్త్రాల ప్రకారం, అనేక అసమానతలతో కూడిన జనసమూహం. కావలిసింది, అసమానతలనించీ విముక్తి!

# ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



బనగానపల్లె (నంద్యాల) :అక్టోబరు 5 (సందేశం టైమ్స్): ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆటో డ్రైవర్లకు రూ. 15000 ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని రాష్ట్ర రోడ్లు, భవనాలు ,పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్ల సేవలో పథకానికి జెండా ఊపి ర్యాలీని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ప్రారంభించారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు ఆటో డ్రైవర్ లతో కలిసి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ర్యాలీలో పాల్గొన్నారు. ఆటో కార్మికుల ఖాకీ చొక్కాను ధరించి మంత్రి ఎంపీడీవో కార్యాలయం వరకు ఆటో నడిపారు. ఎంపీడీవో కార్యాలయంలో బనగానపల్లె నియోజకవర్గంలో 1170 మంది లబ్ధిదారులకు రూ. కోటి 75 లక్షల 50 వేలు రూపాయలు మెగా చెక్కును మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆటో డ్రైవర్లకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఎన్నికల్లో హామీ ఇవ్వనప్పటికీ ఆటో డ్రైవర్లను ఆదుకునేందుకు ఈ పథకం అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రతి ఆటో డ్రైవర్ ఖాతాలో ప్రతి సంవత్సరం రూ.15 వేలు జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆటోడ్రైవర్లకు సంవత్సరానికి రూ.435.35 కోట్లు డ్రైవర్ల ఖాతాలలో జమ చేయనున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేయడం లేదని వైసిపి నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. సంక్షేమ పథకాల అమలులో ప్రతిపక్ష నేతలతో చర్చకు ఎక్కడైనా సిద్ధమని సవాల్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అన్నింటిని అమలు చేస్తున్నామని, సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని తెలిపారు. వైసిపి పాలనలో పంచాయతీరాజ్ శాఖ నిర్వీర్యం అయిపోయిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వీర్యమైపోయిన పంచాయితీలకు పూర్వవైభవం తీసుకొస్తున్నామని తెలిపారు. వైసిపి ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక సదుపాయాలను గాలికొదిలేస్తే కూటమి ప్రభుత్వం కోట్ల రూపాయిలతో సీసీ రోడ్లు, డ్రైనేజీలను నిర్మిస్తున్నాము అని అన్నారు. పోలవరం ప్రాజెక్టును పట్టాలెక్కించి, 2028 ఆగష్టు నాటికి నీళ్లివ్వాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాము. వైసిపి 5 ఏళ్లలో పాలనలో రాజధాని లేని రాష్ట్రంగా చేశారని, ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతిని పరుగులు పెట్టిస్తున్నాము. కూటమి ప్రభుత్వంలో సంక్షేమం అభివృద్ధి సమపాళ్లలో ప్రజలకు అందిస్తున్నాము. స్త్రీశక్తి పథకంతో ఆటో కార్మికుల నష్టపోకుండా ఈ పథకాన్ని అమలు చేస్తున్నాము. వైసిపి ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు కేవలం ఏడాదికి రూ.10 వేలు మాత్రమే ఇస్తే, కూటమి ప్రభుత్వం రూ.15 వేలు ఇస్తోందని మంత్రి జనార్ధన్ రెడ్డి తెలిపారు. వైసిపి పాలనలో అధ్వాన్న, గుంతల రోడ్లతో ఆటోలు, ఇతర వాహనాలు దారుణంగా దెబ్బతిని, వాటి రిపేర్ల వ్యయం తడిసిమోపెడు అయ్యేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక యుద్ధ ప్రాతిపదికన రూ. 1,000 కోట్లు ఖర్చు చేసి రోడ్ల మరమ్మతులు చేపట్టడం జరిగిందన్నారు. రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లను చేశామని తెలిపారు. పాత వాహనాలపై గత ప్రభుత్వం భారీగా వేసిన గ్రీన్ ట్యాక్స్‌ను రూ. 20 వేలు నుంచి రూ.3 వేలకు తగ్గించి వాహనదారులకు భారీ మొత్తంలో ఉపశమనం కల్పించామని తెలిపారు. బనగానపల్లె పట్టణంలో ఆటో స్టాండ్ క్రమబద్ధీకరణ, ఆటో కార్మికుల సమస్యలపై త్వరలో కార్మికులతో చర్చించనున్నట్లు తెలిపారు. మూడు రాజధానుల పేరుతో రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలను వైసీపీ ప్రభుత్వం పారద్రోలిందని, విజనరీ లీడర్ చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో రూ. 4,500 కోట్లతో రహదారుల పనులు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు పాలనలో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని వారి అభివృద్ధి, సంక్షేమం కోసం పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.టి.ఓ. తిరుమల నాయుడు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి రాంభూపాల్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి చంద్రశేఖర్ రెడ్డి, డి ఎల్ పి ఓ నరసింహారెడ్డి, ఎంపీడీవో బాల ఆంజనేయులు, తహసీల్దారు నారాయణరెడ్డి , పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్, టిడిపి నాయకులు, ఆటో డ్రైవర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఒంటరి మహిళలే ఆ సిఐకి టార్గెట్



నంద్యాల అర్బన్ :అక్టోబరు 5(సందేశం టైమ్స్): నంద్యాల పట్టణంలోని నంద్యాల అర్బన్3వ పట్టణ పోలీసు స్టేషన్ అవినీతి అక్రమాలకు కేంద్రంగా నిలిచిందని పలువురు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా మహిళల వేధింపుల ఆరోపణలు అనేకంగా వస్తున్నా ఉన్నతాధికారులు అటువైపు చూడకపోవడం శోచనీయం. ఇటీవల ఓ ఒంటరి మహిళపైన కన్నేసిన 3వ పట్టణ పోలీసు స్టేషన్ ఉన్నతాధికారి కామ దాహార్తితో తన పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారని ఆ మహిళ శుక్రవారం ఆరోపించారు. బాధిత మహిళ పట్ల దురుసుగా ప్రవర్తించడమే కాకుండా ఫోన్ లో అశ్లీలంగా దుర్భాషలాడుతూ న్యూడ్ కాల్స్ చేయాలంటూ ఒత్తిడి తెచ్చాడని మహిళ స్టేషన్ ఎదుటే మీడియా ఎదుట గొంతెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళల సంరక్షణే ధ్యేయంగా శక్తి పేరుతో సరికొత్త యాప్ రూపొందించారు.కానీ ఎవరి పైనా ఇంత వరకు ఎలాంటి చర్యలు లేకపోవడమే కాకుండా రక్షణ కల్పించాల్సిన రక్షక భటులే భక్షక భటులు అయ్యారంటూ పలువురు సామాన్యులు పెదవి విరుస్తున్నారు. పలుమార్లు సస్పెండ్ అయినా ఆయన తీరు మారదని,మరో మహిళ కూడా తనకు ఒక వ్యక్తి నుండి వేధింపులు వస్తున్నాయని కేసు నమోదు చేయాలని కోరినా ఎలాంటి ఎఫ్ఐఆర్ చేయకపోగా ఆమెను కూడా స్టేషన్ చుట్టూ తిప్పుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పడం శోచనీయం.

వివాదాలకు కేంద్ర బిందువుగా సీఐ..!ఆ సీఐ ఎక్కడ ఉంటే అక్కడ వివాదాలు అధికంగా ఉంటాయి. గతంలో ఈయన బాగోతం బాగాలేదని నంద్యాల పట్టణం నుండి బదిలీ చేశారు. అంతే కాకుండా కర్నూలులో ఏకంగా జిల్లా ఎస్పీ పేరు చెప్పి సొమ్ము నొక్కేసినట్లు సమాచారం. ఇంకా ఓ వెహికల్ చెకింగ్ లో గోల్డ్ నొక్కేసి పరారీ అయ్యాక,పెద్దల సహకారంతో సస్పెన్షన్ వేటుతో కేసు నుండి బయటకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈయన ఎక్కడున్నా అక్కడ మహిళలకు వలవేయడంలో ఘనపాటిగా చెబుతారు. ముఖ్యంగా ఒంటరి మహిళలు కేసు కోసం వస్తే వారిపైన వల విసరడంలో అపర చాణక్యుడంటూ కితాబు ఈయనకే దక్కుతుందని ప్రజలు చర్చిస్తున్నారు. డీఐజీకి ఫిర్యాదు చేయాలని వెళ్ళిన సదరు మహిళకు డీఐజీ నుండి నిట్టూర్పు రావడమే కాకుండా ఈ కేసు ఇక్కడ నమోదు చేయబడదు, నంద్యాలలో చేసుకోండంటూ ఉచిత సలహా ఇచ్చారని బాధిత మహిళలు ఆరోపిస్తున్నారు. ఒక తప్పు చేసిన అధికారికి డిపార్టుమెంటు మొత్తం సహకరిస్తూ ఆయనను వెనకేసుకు వస్తున్నారని,తనకు జరిగిన అన్యాయాన్ని ఖండిస్తూ నేరుగా హోం మంత్రిని కలిసి చెప్పుకుంటానని సదరు బాధిత మహిళ చెప్పడం శోచనీయం. స్టేషన్ వెళ్ళిన వారికి న్యాయం చేయకపోగా వారి పట్ల లైంగికంగా వేధిస్తున్న పోలీసు అధికారిపైన తగిన చర్యలు తీసుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు.

## దుర్గాదేవి మండపంలో అపశ్రుతి.. 16 మంది చిన్నారులకు గాయాలు



అక్టోబరు 5 (సందేశం టైమ్స్): విశాఖపట్నం, బెల్లం గణపతి ఆలయ సమీపంలోని దుర్గాదేవి మండపంలో శనివారం అపశ్రుతి చోటు చేసుకుంది. మండపంలో గంజి పడటంతో 16 మంది చిన్నారులకు గాయాలు అయ్యాయి. వీరిలో ఆరుగురు పిల్లలకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం కేజీహెచ్ ఆసుపత్రికి తరలించారు. ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్ట్ ఛైర్మన్ సుధాకర్ ఆసుపత్రికి వచ్చి, గాయపడిన పిల్లలను పరామర్శించారు.

## స్వచ్ఛ పంచాయతీ రాష్ట్రస్థాయి అవార్డుకు 'లొల్ల' ఎంపిక



ఆత్రేయపురం,అక్టోబరు 5 (సందేశం టైమ్స్): పారిశుధ్య నిర్మూలనలో లొల్ల గ్రామం ఆదర్శనీయంగా నిలిచి రాష్ట్ర స్థాయి స్వచ్ఛ అవార్డుకు ఎంపికైంది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం లొల్ల పంచాయతీ స్వచ్ఛ అవార్డుకు ఎంపిక కోసం ఈనెల 6న చంద్రబాబు చేతుల మీదుగా గ్రామ సర్పంచ్ కాయల జగన్నా?థం స్వచ్ఛ భారత్ అవార్డును అందుకోనున్నారు. లొల్ల పంచాయతీలో ముగ్గురు గ్రీన్ అంబాసిడర్లతో ఇంటిం టికి వెళ్లి తడిచెత్త, పొడిచెత్త వేర్వేరుగా సేకరించడంతో పాటు వర్మికంపోస్టు తయారు చేశారు. చెత్త నుంచి సంపద సృష్టించి స్వచ్ఛ రహిత గ్రామంగా తీర్చిదిద్దడంలో సర్పంచ్ జగన్నాథం, కార్యదర్శి కృష్ణామాచార్యులు ఎంతగానో కృషిచేశారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా లొల్ల గ్రామంలో 90 శాతం అపారిశుధ్యం నిర్మూలించడంలో తీవ్ర కృషిచేశారు. ఈ నేపథ్యంలో లొల్ల పంచాయతీ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికైంది.

## డా. బి. వి. స్వరూప్ సిన్హాకు జీవిత సాఫల్య పురస్కారం

కర్నూలు :అక్టోబరు 5 (సందేశం టైమ్స్): అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాజస్థాన్ కోట కర్నూలు శాఖ, మోషన్ కళాశాల అధ్యాపకులు డా. బి. వి. స్వరూప్ సిన్హా జీవిత సాఫల్య పురస్కారానికి ఎంపిక అయ్యా రని లయన్స్ క్లబ్, అలియెన్స్ క్లబ్ సంయుక్త సంస్థ అధ్యక్షులు లయన్ డా. రాయపాటి శ్రీనివాస్ శనివారం తెలియజేశారు. డా. సిన్హా తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం లో ఎం. ఎస్. సి. బొటనీ, పి. హెచ్. డి. చేశారు. శ్రీ జయేంద్ర సరస్వతి డిగ్రీ కళాశాల, మోంటెస్సోరి, శాంతి నికేతన్ కళాశాలల్లో అధ్యాపకులుగా, ప్రిన్సిపాల్ గా, సుమారు 40 సంవత్సరాలుగా వృక్ష శాస్త్రాన్ని బోధిస్తూ, విద్యార్థులు, వారి తల్లి దండ్రుల నుండి ఉత్తమ ఉపాధ్యాయునిగా పేరు పొందారు. రచనా రంగంలో విశేష ప్రతిభ కనబరుస్తూ పలు పురస్కారాలను పొందారు. యువతకు విద్యతో పాటు నైతిక విలువలను, జీవితం పట్ల సానుకూల దృక్పథం, సమాజ సేవ, కళా సాంస్కృతిక రంగాలలో ప్రోత్సాహాన్ని అందజేస్తున్నారు.



## అన్నమయ్య జిల్లాలో

# రూ.1.75 కోట్ల నకిలీ మద్యం స్వాధీనం



### తొమ్మిది మందిని అరెస్ట్ చేసిన పోలీసులు

ములకలచెరువు అక్టోబరు 5(సందేశం టైమ్స్): : అన్నమయ్య జిల్లా మొలకలచెరువులో ఎక్సైజ్ అధికారులు పెద్ద ఎత్తున కల్తీ మద్యం తయారీని అడ్డుకున్నారు. నకిలీ మద్యం స్థావరాన్ని ఎక్సైజ్ పోలీసులు గుట్టురట్టు చేశారు. రూ.1.75 కోట్లు విలువ చేసే నకిలీ మద్యం, వాటిని తయారు చేసే పరిక రాలను, 9 మందిని, అమ్మకాలు నిర్వహిస్తున్న ఓ బ్రాందీ షాపు యజమాని, ఓ బెల్షాపు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం విలేకరుల సమా వేశంలో ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్రెడ్డి వివరాలను వెల్లడించారు. మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ వద్ద గతంలో డాబా నిర్వహించేవారన్నారు. సంవత్సర కాలంగా డాబా సక్రమంగా జరగకపోవడంతో డాబాను బ్రాందీ షాపు గోడౌను వాడుకుంటున్నారని తెలిపారు. గోడౌన్లో నకిలీ మద్యం తయారు చేస్తూ బ్రాందీషాపులకు సరఫరా జరుపుతూ భారీగా నకిలీ మద్యం అమ్మకాలు జరుపుతున్నట్లు ఎక్సైజ్ శాఖకు సమాచారం రావడంతో దాడులు చేశామన్నారు. ఈ దాడిలో నకిలీ మద్యం తయారు చేస్తున్న తమిళనాడుకు చెందిన నలుగురు విశాఖపట్నం చెందిన ఒకరు, ఒరిస్సాకు చెందిన ఇద్దరు, నర్సీపట్నంకు చెందినా ఒకరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. పిటిఎం మండలంలో నిర్వహిస్తున్న ఆంధ్ర వైన్స్ షాపులు ఈ నకిలీ మద్యం బాటలను గుర్తించడంతో మద్యం షాప యజమాని, టిడిపి నాయకుడు సురేంద్రనాయుడుని అదుపులోకి తీసుకు న్నామన్నారు. గోడౌన్లో ఉన్న స్పిరిట్ క్యాన్లు, మిషన్లు, మద్యం బాటళ్లకు అతికిచ్చే లేబుల్ పేపర్లను, నకిలీ మద్యాన్ని సరఫరా చేసే బొలేరో వాహనాన్ని స్వాధీనం చేసుకుమని తెలిపారు. గోడౌను సీజ్ చేశారు. చాలా రోజులుగా ఈ గోడౌన్లో నకిలీ మద్యం జరుగుతున్నట్లు తెలిపారు. అనేక బ్రాందీ షాపులకు ఈ నకిత్ మద్యం సరఫరా అవుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే కొన్ని మద్యం షాపులను ఈ ప్రాంతంలో సోదాలు నిర్వహించగా, పిటిఎం మండలంలోని ఆంధ్ర వైన్స్ దుకా ణంలో నకిలీ మద్యం దొరకడంతో షాపును యజమాని సురేంద్ర నాయుడుని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ములకలచెరువులోని ఓ వైన్షాప్ యజమా నిని కూడా అదుపులోకి తీసుకుంటున్నట్లు తెలిపారు. పెద్ద ఎత్తున జరుగుతున్న నకిలీ మద్యంపై మరిన్ని సోదాలు దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు తంబళ్లపల్లి నియోజకవర్గంలోని మద్యం దుకాణాలు, బెల్ట్ షాపులలో పెద్ద ఎత్తును నకిలీ మద్యం అమ్మకాలు జరుపుతున్నారు. ప్రభుత్వం స్పందించి నకిలీ మద్యం దారులపై కొరడా ఝులిపించకపోతే మద్యం సేవించే ప్రజలు నష్టాల ఊబిలో కురుకుపోయి ప్రమాదం ఉంది. ఈ దాడులలో అన్నమయ్య జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్, ఎఇఎస్ జోగేంద్ర, సిఐలు నీలకంఠేశ్వర్రెడ్డి కిషోర్, జహీర్ అహ్మద్, డిటిఎఫ్ సిఐ ఎల్లయ్య, ఎస్ఐలు జబీబుల్లా, సతీష్ ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రమాద స్థాయిని మించిన వంశధార



అక్టోబరు 5 (సందేశం టైమ్స్): అర్ధరాత్రి నుండి కురుస్తున్న వర్షంతో మహోగ్రరూపం దాల్చిన వంశధార ఉవ్వెత్తున ప్రవహించింది. అనేకచోట్ల కరకట్టలను ఒరుసుకుని పరుగులు పెట్టింది. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న ఆందోళన స్థానిక ప్రజల్లో నెలకొంది. పల్లపు ప్రాంతాలు పెద్దఎత్తున జలమయమయ్యాయి. అయితే, శుక్రవారం సాయంత్రం 4 గంటల తరువాత వరద తీవ్రత కొంచెం తగ్గడంతో అధికారయంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. వంశధార వరద ధాటికి కొత్తూరు మండలం పెనుగోటివాడ జల దిగ్బంధంలో చిక్కుకుంది. మాతల వంతెనపై మూడు అడుగుల మేర వరద నీరు ప్రవహించింది. అదే మండలంలోని కుంటిభద్ర, వసప, నివగాం, మాతల, వి.ఎన్ పురం, కుద్దిగాం, పొన్నుటూరు, సోమరాజపురం, ఆకులతంపర, అంగూరు, పాతపాడు, మాకవరం తదితర గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. హిరమండలం మండలంలోని జిల్లేడుపేటను వరద నీరు చుట్టుముట్టడంతో ఎన్డిఆర్ఎఫ్ బృందాలు బోట్ల సాయంతో గ్రామస్తులకు నిత్యావసర సరుకులను అందించారు. నాగావళి నదిలో శ్రీకాకుళం పాత వంతెన గరిష్టంగా 28 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. గరిష్టంగా 40 వేల క్యూసెక్కుల వరకు చేరే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. అటు మహేంద్రతనయ, బాహుదా నదులూ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. బాహుదా నది వరద ప్రవాహంలో చిక్కుకున్న ఓ యువకుడిని పోలీసులు రక్షించారు. పలాస మండలం బ్రాహ్మణతర్లా వరహాల గెడ్డ వంతెనపై నుంచి మూడడుగుల ఎత్తులో వరద నీరు ప్రవహించడంతో బ్రాహ్మణతర్లా, లక్ష్మీపురం, బంటుకొత్తూరు, నీలిభద్ర, కేశుపురం, పెద్దనారాయణపురం తదితర గ్రామాలకు రెండు రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. కిష్టుపురం రైల్వే అండర్ పాసేజ్ లో వరద నీరు చేరడంతో గరుడఖండి, పాత జగదేవుపురం, జగదేవుపురం, లక్ష్మీపురం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. సమీప గిరిజన గ్రామాలు, గెడ్డల నుంచి వరద నీరు ముంచెత్తడంతో పలాస జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష నివాసాన్ని వరద నీరు చుట్టుముట్టింది. వర్షాల ప్రభావంతో వరి పంట తొమ్మిది వేల ఎకరాల్లో నీట మునిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. వంశధార నదీ పరివాహక ప్రాంతాల్లో పాఠశాలలకు సెలవు ప్రకటించారు.

పంటలకు అపార నష్టం

పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో గురువారం కురిసిన భారీ వర్షాలకు భారీ పంట నష్టం వాటిల్లింది. సాలూరు, భామిని, వీరఘట్టాం, కురుపాం, జియ్యమ్మవలస, కొమరాడ మండలాల్లో ఎక్కువగా అరటి, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. వీరఘట్టాం మండలంలో అత్యధికంగా వెయ్యి ఎకరాల్లో అరటి నేలకొరిగింది. విజయనగరం జిల్లాలో గాలులకు విద్యుత్తుశాఖకు రూ.20లక్షలు నష్టం వాటిల్లింది. 43 సబ్ స్టేషన్లు మరమ్మత్తులకు గురయ్యాయి. జిల్లాలో వ్యవసాయ సర్వీసులు 2126 మరమ్మత్తులకు గురి కాగా వాటిలో 1991 సర్వీసులను పునరుద్ధరించినట్లు విద్యుత్తుశాఖ ఎస్ఇ మువ్వల లక్ష్మణరావు తెలిపారు. కౌలు రైతు ఆత్మహత్యాయత్నంపార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం కల్లికోట గ్రామానికి చెందిన బీజ రాము రెండెకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నారు.టమాట, క్యాబేజీ పంటల సాగుకు సుమారు రెండు లక్షల రూపాయలు వరకు పెట్టుబడి పెట్టాడు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నాగావళి నదిలో నీటిఉధృతికి పంట పొలం ముంపునకు గురైంది. దీంతో మనస్థాపం చెందిన రాము%ొ%.పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సకాలంలో కుటుంబ సభ్యులు స్పందించడంతో ప్రాణపాయం తప్పింది. ప్రసుత్తం చికిత్స పొందుతున్నారు.

# స్పౌజ్‌లకు అంతర్ జిల్లా బదిలీల్లో అవకాశం



అమరావతి బ్యూరో :అక్టోబరు 5 (సందేశం టైమ్స్): ఉపాధ్యాయుల అంతర్జిల్లా బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న స్పౌజ్లకు బదిలీ అవకాశం కల్పించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బి గోపిమూర్తి కోరారు. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్కు శుక్రవారం లేఖ రాశారు. సర్ప్లస్, డెఫిషిట్ పేరుతో కొంతమంది స్పౌజ్లకు బదిలీల్లో అనుమతినివ్వలేదని తెలిపారు. ఐదేళ్ల తరువాత జరుగుతున్న ఈ బదిలీల్లో వారికి అవకాశం ఇవ్వకపోతే వారి కుటుంబాలు ఇబ్బందికర పరిస్థితుల్లోకి నెట్టవేయబడతాయని పేర్కొన్నారు. చాలా ఏళ్ల నుంచి కుటుంబానికి దూరంగా ఉంటున్నారని, మానవతా దృక్పథంతో అవకాశం ఇవ్వాలని కోరారు. జిల్లా పరిషత్, ప్రభుత్వ యాజమాన్యాలకు లాంగ్వేజ్ పండిట్ నుంచి స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగోన్నతులకు అవకాశమిచ్చారని తెలిపారు. పండిట్లకు ఇవ్వగా మిగిలిన స్కూల్ అసిస్టెంట్ పోస్టులను అర్హత గల ఎస్జిటిలకు ఉద్యోగోన్నతుల ద్వారా కల్పించాలని కోరారు. మున్సిపల్, కార్పొరేషన్లలో 100 శాతం లాంగ్వేజ్ స్కూల్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతులు కల్పించాలని తెలిపారు. చాలా ఏళ్ల నుంచి ఆర్థికశాఖ వద్ద పెండింగ్లో ఉన్న గిరిజన సంక్షేమశాఖ లాంగ్వేజ్ పండిట్ అప్గ్రేడేషన్ ఫైల్ను క్లియర్ చేయించి ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పండిట్, పిఇటి పోస్టుల అప్గ్రేడేషన్ ఫైల్ త్వరితగతిన ఆమోదించాలని ఆర్థికశాఖ జాయింట్ సెక్రటరీ ఎ గౌతమ్కు గోపిమూర్తి మరో లేఖ రాశారు.

# తిరుపతిలో భారీ వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం..



–తిరుపతి :అక్టోబరు 5(సందేశం టైమ్స్):: తిరుపతిలో ఐదు గంటలుగా భారీగా భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. భారీ వానకు రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. నగరంలోని రైల్వే అండర్ బ్రిడ్జిలు సైతం వర్షపు నీటితో పూర్తిగా నిండిపోయాయి. ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్ దగ్గర కూడా నీరు నిలిచిపోయాయి. తిరుపతిలోని అనేక ప్రాంతాల్లో ఇళ్లలోకి వరద నీరు చేరింది. భారీ వర్షంతో ప్రయాణికులతో పాటు, శ్రీవారి యాత్రికులు, ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

# కొండాపూర్‌లో హైడ్రా కూల్చివేతలు..



కొండాపూర్:అక్టోబరు 5 (సందేశం టైమ్స్): హైదరాబాద్లోని కొండాపూర్లోగల బిక్షపతి నగర్లో శనివారం ఉదయం నుంచే హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. ఆర్టీఏ కార్యాలయం పక్కన భిక్షపతి నగర్ ప్రభుత్వ స్థలంలోని అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్నట్లు హైడ్రా సిబ్బంది పేర్కొన్నారు. భారీ పోలీస్ బందోబస్తు నడుమ కూల్చివేతలు కొనసాగుతున్నాయి. కాగా కూల్చివేతల వద్దకు మీడియాను కూడా పోలీసులు అనుమతించడం లేదు. రెండు కిలోమీటర్ల దూరంలోనే మీడియాను, స్థానికులను పోలీసులు అడ్డుకుంటున్నారని సమాచారం.

# తిరుపతికి మరో బాంబు బెదిరింపు ఈ-మెయిల్.. ఇస్కాన్‌లో తనిఖీలు



తిరుపతి :అక్టోబరు 5 (సందేశం టైమ్స్):తిరుపతికి మరో బాంబు బెదిరింపు ఈ–మెయిల్ వచ్చింది. ఇస్కాన్ టెంపుల్లో బాంబులు పెట్టామని ఆ మెయిల్లో ఆగంతకులు హెచ్చరించారు. మొత్తం మూడు లొకేషన్లలో ఐఈడీలు ఉన్నాయని వార్నింగ్ ఇచ్చారు. దీంతో అప్రమత్తమన అధికారులు ఉదయం నుంచి బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ తో అత్యవసర తనిఖీలు కొనసాగిస్తున్నారు. ఆలయాలు, బస్టాండ్, రైల్వే స్టేషన్ దగ్గర క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు.

# విశాఖలో బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు



భీమిలి అక్టోబరు 5 (సందేశం టైమ్స్)::విశాఖలో మరొకసారి బాణసంచా పేలుడు కలకలం సృష్టించింది. భీమిలి మండలంలోని వలందపేట బాణాసంచా తయారీ కేంద్రంలో పేలుడు సంభవించింది. ఈ పేలుడు ఘటనలోముగ్గురికి గాయాలయ్యాయి. వారి పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేస్తున్నారు. గాయపడిన వారిని కేజీహెచ్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియల్సి ఉంది.

# విజయనగరం ఉత్సవాలకు హెూం మంత్రి అనితకు ఆహ్వానం



విజయనగరం కోట :అక్టోబరు 5 (సందేశం టైమ్స్): రేపటి నుంచి రెండు రోజుల పాటు విజయనగరం జిల్లాలో ఘనంగా జరగనున్న విజయనగరం ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ ఉత్సవాల ప్రారంభోత్సవానికి హెూం మంత్రి వంగలపూడి అనితను ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా విజయనగరం జిల్లా టూరిజం ఆఫీసర్ కుమారస్వామి విశాఖపట్నంలోని క్యాంప్ కార్యాలయంలో మంత్రి అనితకు ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం మంత్రి ఉత్సవాల ఏర్పాట్లపై చర్చించారు. విజయనగరం జిల్లా చారిత్రక ప్రాముఖ్యతను దేశమంతటా తెలియజేయాలన్న ఉద్దేశంతో, ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని మంత్రి అనిత అధికారులకు సూచించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు.

# సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ గా మాజీ ఎమ్మెల్యే



నందవరం (కర్నూలు) :అక్టోబరు 5 (సందేశం టైమ్స్): వైసీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ గా మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి నియమించబడ్డారు. ఈ సందర్భంగా నందవరం మండలం వైసిపి నాయకులు ఆయన నివాసాన్ని చేరుకొని ఆయను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడారు. నందవరం మండల వైసీపీ నాయకులు అధైర్యపడోద్దని మీకు ఎర్రకోట ఫ్యామిలీ అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చినట్లు తెలిపారు.ప్రతి ఒక్కరు పార్టీ కొరకు కష్టపడి పని చేయాలని చెప్పారన్నారు. వి.రాజేష్ శెట్టి, కె నాగప్ప, షేక్ అహ్మద్,పి. ఈరన్న శెట్టి,తెలుగు రంగారెడ్డి,బుగిడ్డి ఈరన్న,కె.రాముడు,కాకి అదేన్న, మంగలి రామాంజి,నాగరాజు, నడిపి రాముడు, వడ్డే వీరేష్, వడ్డే దస్తగిరి, నరసింహాలు, రుద్ర, ఉషేని గౌడ్, చందు పాల్గొన్నారు.

# ఎడతెరిపి లేని వర్షం.. పొంగి పొరలుతున్న వాగులు వంకలు



సోమల(చిత్తూరు) :అక్టోబరు 5(సందేశం టైమ్స్): సోమల మండలంలో రాత్రి 12 గంటల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తోంది. భారీ వర్షం కారణంగా మండలంలోని పలు చెరువులు పూర్తిస్థాయిలో నిండటంతో వాగులు, వంకలు, పరవళ్ళు తొక్కుతూన్నాయి. దీంతో పలు ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పెద్ద ఉప్పరపల్లి నుండి బసవ పల్లెకు వెళ్లే మార్గంలో తాత్కాలిక మట్టితో నిర్మించిన వంతెన గార్గేయ నది ఉధృతి కారణంగా కోట్టుకుపోతుంది. దీని కారణంగా అధికారులు రాకపోకలు నిలిపివేశారు. పెద్ద ఉప్పరపల్లి నుండి చౌడేపల్లి మార్గంలో వెళ్లే పెద్దవంక ఉధృతంగా ప్రవహిస్తూ ఉండడంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. సీతమ్మ చెరువు మరవ వద్ద భారీ స్థాయిలో వర్షపునీరు.. ఆవుల పల్లె పెద్ద ఉప్పరపల్లి మార్గంలో ప్రవహిస్తూ ఉండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మరికొన్ని ప్రాంతాలలో కూడా వర్షం కారణంగా రాకపోకలు నిలిచిపోయినట్లు సమాచారం.

# ముంచెత్తిన వాన

పార్వతీపురం, అక్టోబరు 5 (సందేశం టైమ్స్): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగండం కారణంగా జిల్లావ్యాప్తంగా ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వరి పొలాలు నీట మునిగాయి. అరటి, మొక్కజొన్న నేలవాలాయి. ప్రధాన కూడళ్లు, రోడ్లపై వర్షపునీరు నిలిచింది. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడింది. మరోవైపు ఎడతెరిపి లేకుండా వాన కురవడంతో విజయ దశమి రోజున ప్రజలకు పండుగ సందడి లేకుండాపోయింది. కాగా ఈనెల 4 వరకు భారీగా వర్షాలు పడే అవకాశం ఉన్నందున కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఏ సమస్య ఉన్నా ప్రజలు ఈ 08963-796085 నెంబర్‌కు ఫోన్ చేయాలని కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి సూచించారు. పాఠశాలలకు ఆయన సెలవు ప్రకటించారు.

# విద్యార్థులకు జీఎస్టీపై అవగాహన



ఆలమూరు (కోనసీమ) అక్టోబరు 5 (సందేశం టైమ్స్): జీఎస్టీ పన్నులు తగ్గింపుపై మండలంలోని బడుగువానిలంక ఎంపీయూపీ స్కూల్లో విద్యార్థులకు సర్పంచ్ దూలం వెంకటలక్ష్మి సత్తిబాబు అధ్యక్షతన శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి సిహెచ్.వి.వెంకట రెడ్డి మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణలు దేశ చరిత్రలో నూతన అధ్యాయంగా మిగిలిపోతుందన్నారు. నాలుగు స్లాబులుగా ఉండే జీఎస్టిని కేంద్రం రెండు స్లాబులుగా సంస్కరించిందని, నిత్యవసర వస్తువులు, మందులపై జీరో శాతం జీఎస్టి అమల్లోకి తెచ్చిందన్నారు. రైతులకు మేలు చేసే పరికరాలపై 8 నుంచి 5 శాతానికి తగ్గించారన్నారు. సులభతరమైన జీఎస్టీ వ్యవసాయ యంత్రాలపై 12 శాతం ఉన్న జీఎస్టీ ను 5 శాతానికి తగ్గించడం, ఎన్డీఏ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్ గిఫ్ట్ గా అభివర్ణించారు. ఆంధ్రప్రదేశ్లో డబుల్ ఇంజన్ సర్కార్ డబుల్ బెనిఫిట్స్ కల్పించిందన్నారు. ఎంఎస్ఎంలపై ఉన్న 28 శాతాన్ని 12 శాతానికి తగ్గించి మేలు చేశారన్నారు. చిరు వ్యాపారులకు, వ్యవసాయ, విద్యా రంగాలకు మేలు జరిగేలా జీఎస్టి తగ్గించారని ,మనం తయారు చేసిన వస్తువులు మనమే కొనుక్కునే విధంగా ఉండాలని, దీని ద్వారా ఆర్థిక వ్యవస్థ బలపడుతుందన్నారు. అలాగే విద్యార్థులు అడిగిన పలు అనుమానాలను వారు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఈవీఎస్ఎల్ఎస్ శాస్త్రి, ఎస్విహెచ్ఎ పి.వినోద్ కుమార్, మహిళా పోలీస్ కామేశ్వరి, ఉపాధ్యాయులు ఎం.సుబ్బయ్య, విక్టర్ పాల్, తదితరులు పాల్గొన్నారు.

# అర్హత ఉండి.. లబ్ధి పొందని వారు దరఖాస్తు చేసుకోండి : ఆదిశేషారెడ్డి




చాపాడు (మైదుకూరు) :(సందేశం టైమ్స్): ఆటో డ్రైవర్లు వాహన మిత్రులకు సంబంధించి అర్హత ఉండి అర్హుల జాబితాలో పేరు రాకపోతే తిరిగి దరఖాస్తు చేసుకోవాలని నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ ఆదిశేషారెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని ఎస్‌సిసిఆర్ కళ్యాణ మండపంలో ఆటో డ్రైవర్ల సేవలో ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. మైదుకూరు నాలుగు రోడ్ల కూడలి నుండి ఆటోలతో అధికారులు, నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన వారి జాబితాను సచివాలయ సిబ్బంది సిద్ధం చేశారన్నారు. ఇంకా అర్హత ఉండి ఏదైనా కారణాలతో పేరు రాకపోతే గ్రీవెన్స్‌కు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం అందజేస్తున్న రూ. 15వేలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ రంగస్వామి, ఎంపిడిఓలు శ్రీధర్ నాయుడు, దివిజాసంపతి, కనీస వేతనాల కమిటీ డైరెక్టర్ దాసరి బాబు, నీటిపారుదల సంస్థ డైరెక్టర్ అన్నవరం సుధాకర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఏపీ రవీంద్ర, సొసైటీ చైర్మన్ పాశం మారుతి, టిడిపి నాయకులు ధనపాల జగన్, వెంకటరమణారెడ్డి, పుట్టా ప్రభాకర్, నాయకులు, సచివాలయ సిబ్బంది,ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు వెట్లపాలెం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు



సామర్లకోట (కాకినాడ) :అక్టోబరు 5 (సందేశం టైమ్స్): తూర్పు గోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ సంఘం ఆధ్వర్యంలో కాకినాడ డిఎస్ఏ గ్రౌండ్స్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి రెజ్లింగ్ (పహల్వానీ) బాలుర, బాలికల క్రీడా పోటీలలో వెట్లపాలెం జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల (శ్రీ కొండపల్లి గంగన్న మెమోరియల్ జిల్లా ప్రజాపరిషత్ పాఠశాల) విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. ఈ పోటీలలో ఐదుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనురాధ చెప్పారు. వీరిలో ఏ.శ్రీధర్ (55 కేజీల విభాగం), కే.గౌతమ్ (80 కేజీల విభాగం), కే.ప్రవీణ్ (52 కేజీల విభాగం), డి.హారిక శ్రీ (65 కేజీల విభాగం), డి.సింధుష (62 కేజీల విభాగం). రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయిని అనురాధ, విద్యా కమిటీ చైర్మన్ శివ, వేట్లపాలెం గ్రామ సర్పంచ్ ఎస్ వెంకట లక్ష్మీ, ఉప సర్పంచ్ గోలి శ్రీరామ్, మాజీ ఎంపీపీ కొండపల్లి కృష్ణమూర్తి, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, టిడిపి నాయకులు గుమ్మల్ల రామకృష్ణ, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు. అలాగే విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చిన పిఈటి యార్లగడ్డ బంగార్రాజు, ఎం.డి. ఇబ్రాహీం విద్యార్థులను వారు అభినందించారు.

# ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే కంటైనర్ దుకాణం

ప్రొద్దుటూరు , అక్టోబరు 5(సందేశం టైమ్స్): విద్యుత ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే కంటైనర్ దుకా ణం ఏర్పాటు చేసినా అధికా రులు ఎందుకు పట్టించుకోరని పలువు రు ప్రశ్నిస్తున్నారు. ప్రొ ద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో సెట్ బ్యాక్స్ స్థలాలను పార్కింగ్‌కు వదలకుండా ఆక్రమించి కంటైనర్ దుకాణాలు పెట్టించి భవంతుల యజమానులు అద్దెలు వసూలు చేస్తున్నా రు. ఈ ఆక్రమణలు గాంధీ రోడ్డుమీద గాంధీ విగ్రహం సమీ పంలో ఉండడం అందరినీ ఆశ్చర్యానికి గురుచేస్తోంది. ఆ భారీ భవంతిలో జాతీయ బ్యాంకు, ప్రైవేటు హాస్పిటల్‌తో పాటు అనేక ఇనిస్టిట్యూట్స్ ఉండడంతో నిత్యం ప్రజలు భారీగా వచ్చి పోతుంటారు. ఆ కాంప్లెక్స్‌కు ముందు టూవీలర్ పార్కింగ్ లేక రోడ్డుపై పార్కింగ్ చేస్తున్నా టౌనప్లానింగ్ అదికారులకు పట్టలే దు. ఆ కంటైనర్ పక్కనే విద్యుత ట్రాన్స్‌ఫార్మర్ ఉన్నా విద్యుత అధి కారులు పట్టించుకోలేదు. కాగా ఈ విషయమై టౌనప్లానిం గ్ అధికారి చంద్ర మోహనను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఆ కంటైనర్ దుకాణం పెట్టుకోవడానికి తాము అనుమతి ఇవ్వలేదని వారికి నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే విద్యుత ఏఈ సుహాసిని వివరణ కోరగా కంటైనర్ దుకాణం ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే పెట్టడం ప్రమాదకమన్నారు. దీనిపై కంటై న ర్ దుకాణం తొలగించమని నోటీసులు ఇచ్చామని చెప్పారు.



## భక్తులతో కిటకిటలాడుతున్న యాదాద్రి..
## దర్శనానికి 2 గంటల సమయం



హైదరాబాద్ :అక్టోబరు 5 (సందేశం టైమ్స్): యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. లక్ష్మీ నరసింహ స్వామి వారి దర్శనానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. క్యూలైన్లన్ని భక్తులతో నిండిపోయాయి. స్వామి వారి సర్వదర్శనానికి రెండు గంటల సమయం, ప్రత్యేక దర్శనానికి ఒక గంట సమయం పడుతోంది.

## స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి : కలెక్టర్ హనుమంతరావు

ఆత్మకూరు(ఎం), అక్టోబరు 5 (సందేశం టైమ్స్): స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శనివారం ఆత్మకూర్(ఎం) మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని, ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం ఎన్నికల సామగ్రిని పరిశీలించారు. ఆయన వెంట తాసీల్దార్ లావణ్య, ఎంపీడీఓ రాములు నాయక్, డిప్యూటీ తాసీల్దార్ సఫియుద్దిన్, ఎంపీఓ పద్మావతి, ఆర్ఐ మల్లికార్జునరావు, సూపరింటెండెంట్ లోకేశ్వర్ రెడ్డి ఉన్నారు.



## నాగార్జున సాగర్‌కు కొనసాగుతున్న భారీ వరద..



నల్లగొండ:అక్టోబరు 5 (సందేశం టైమ్స్): నాగార్జునసాగర్ డ్యామ్‌కు వరద ప్రవాహం కొనసాగుతున్నది. దీంతో అధికారులు 26 గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. 2.70 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, అంతే మొత్తంలో దిగువకు వెళ్తున్నది. స్పిల్ వే ద్వారా 2.16 లక్షల క్యూసెక్కులు వెళ్తుండగా, ఎడమ కాల్వకు 8193 క్యూసెక్కులు, విద్యుత్ కేంద్రానికి 33,291 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు.

## గంతలమయంగా ఎన్‌హెచ్ 930పీ.. వాహదారుల ఇబ్బందులు



టేకులపల్లి, అక్టోబరు 5 ((సందేశం టైమ్స్): భద్రాద్రి కోత్తగూడెం జిల్లా టేకులపల్లి మండల ప్రజలకు ఇటు కొత్తగూడెం వెళ్లాలన్నా, అటు ఇల్లెందు వెళ్లాలన్నా రహదారి ఇబ్బందికరంగా మారి ప్రయాణం నరక ప్రాయమైంది. ఓ వైపు లారీల దుమ్ము, మరోవైపు గుంతలతో ప్రయాణం ప్రమాదకరంగా ఉందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగూడెం నుండి ఇల్లెందు ప్రధాన రహదారిలో నిత్యం వేలాది వాహనాలు తిరగడంతో రద్దీ ఎక్కువగా ఉంటుంది. నేషనల్ హైవే పూర్తయ్యేదెన్నడోనని, రోడ్డు ఇంకా అధ్వానంగా తయారైందని ఆవేదన వ్యకం చేస్తున్నారు.ఇటీవలే మూడు రోజులు లోడుతో ఉన్న లారీలు గుంతలతో బోల్తా పడ్డాయని, టూ వీలర్స్‌తో ప్రయాణం చేయాలంటే ఇబ్బంది పడుతున్నట్లు మండల ప్రజలు అవేదన చెందుతున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రయాణం చేసే రోడ్డుపై పట్టింపులేదనే విమర్శలు వినవస్తున్నాయి. ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకుని కనీసం గుంతలనైనా పూడ్చాలని, మండల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

## దుర్గం చెరువులో.. చేపలు చనిపోతున్నాయ్..



## వర్షాలకు చేరుతున్నకలుషిత జలాలే కారణమా.?

హైదరాబాద్ సిటీ:అక్టోబరు 5(సందేశం టైమ్స్): దుర్గం చెరువులలో చేపలు మళ్లీ చనిపోతున్నాయి. వారం రోజులుగా దుర్గం చెరువులోని నీళ్లపై చనిపోయిన చేపలు తేలియాడుతున్నాయి. అవి ఒడ్డుకు చేరడంతో దుర్వాసన వెదజల్లుతోంది. చెరువులోకి కలుషిత జలాలు, సీవరేజ్ వ్యర్థాలు చేరకుండా వాటర్‌బోర్డు అధికారులు కట్టడి చేశారు. ఎస్టీపీల నిర్మించి శుద్ధి చేసిన జలాలే దుర్గం చెరువులో చేరేవిధంగా చర్యలు చేపట్టారు. అయినా ఏడాదిన్నర నెలల క్రితం దుర్గం చెరువులో చేపలు చనిపోవడంతో మురుగు వ్యర్థాలు చేరకుండా కట్టడి చేశారు.

## ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్ డైలీ వేజ్ వర్కర్ల పై ప్రభుత్వం మొండి వైఖరీ వీడాలి

ఇల్లెందు :అక్టోబరు 5 (సందేశం టైమ్స్): ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్ డైలివేజ్ ఔట్ సోర్సింగ్ వర్కర్లు గత 23 రోజులుగా నిర్వహిస్తున్న సమ్మెపై ప్రభుత్వం మొండి వైఖరి అవలంభిస్తుందని జేఏసీ నాయకులు అబ్దుల్ నబీ అన్నారు. ఇల్లెందు పట్టణ, మండల పరిధిలో ఉన్న బాలికల, బాలుర ట్రైబల్ వెల్ఫేర్ హాస్టళ్లలో పనిచేస్తున్న డైలివేజ్ ఔట్ సోర్సింగ్ వర్కర్లు శనివారం సమ్మెను తిరిగి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబి, జేఏసీ నాయకులు లక్ష్మణ్, లక్ష్మీనారాయణ రామకళా ,మంగలు రొంపెడు బాలికల ఆశ్రమ పాఠశాల వద్ద సమ్మె శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హాస్టల్ డైలీ వేజ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తున్నదని, కార్మికులతో వెట్టి చాకిరి చేయిస్తూ ఊడిగం చేయిస్తుందని వాపోయారు. పెండింగ్




వేతనాలు ఇవ్వకుండా, కొత్త మెనూ ప్రకారం మరింత పని భారం పెంచిందని ఆరోపించారు. టైమ్ స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో స్వామి, తారబాయ్,నాగేశ్వరరావు, వజ్జ నగేష్, కుమార్, హాస్టల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## అపార్ కష్టాలు.. గడువు తేదీలోపు పూర్తి చేయాలంటూ విద్యాశాఖాధికారుల ఆదేశాలు

అక్టోబరు 5(సందేశం టైమ్స్): 2025-26 విద్యా సంవత్సరం నుంచి దేశ వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) ఐడీ జనరేషన్‌ను కేంద్ర ప్రభుత్వం తప్పనిసరి చేసింది. అదే తడవుగా ఆయా రాష్ట్రాలతోపాటు తెలంగాణ ప్రభుత్వం కూడా కిందిస్థాయి ఇబ్బందులేమీ పట్టించుకోకుండా కేంద్రానికి వంత పాడుతూ విద్యాశాఖకు ఆదేశాలిచ్చింది. దీంతో విద్యార్థులకు, తల్లిదండ్రులకు అపార్ కష్టాలు మొదలయ్యాయి. ఆయా జిల్లా విద్యాశాఖాధికారులు ప్రతి విద్యార్థికీ అపార్ చేయించాలని ఆదేశాలివ్వడంతో 1వ తరగతి నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్థి వరకు అపార్ జనరేషన్ చేయించుకుంటున్నారు. అపార్ ఐడీ కార్డు అనేది డిజీ లాకర్ అనే యాప్, ఏబీసీ(అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్) అనే సాంకేతికతతో కలిసి ఉంటుంది. దీని ద్వారా విద్యార్థుల విద్యకు సంబంధించిన డేటా గోప్యంగా ఉంటుందని విద్యాశాఖాధికారులు అంటున్నారు. అయితే, ప్రతి విద్యార్థి అపార్ నంబర్ పొందడం తప్పనిసరి కాదని కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ తన వెబ్‌సైట్‌లోని ఒక పత్రంలో ఈ మధ్యనే పేర్కొంది. అయినప్పటికీ ఆయా రాష్ట్రాలు విద్యార్థులకు అపార్ చేయించాలంటూ సర్క్యులర్లు జారీ చేస్తున్నాయి. అయితే, ఇప్పటికే ప్రతి వ్యక్తికి, ప్రతి విద్యార్థికి ఆధార్ కార్డులు ఉండగా.. మళ్లీ విద్యార్థులకు అపార్ కార్డు ఏమిటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.




# క్రీడావార్తలు




## ఆస్ట్రేలియాలో వన్డే సిరీస్.. రోహిత్ శర్మ స్థానంలో కెప్టెన్‌గా గిల్

ఇంటర్నెట్ డెస్క్: ఇకపై వన్డే మ్యాచుల్లో టీమిండియాను శుభ్‌మన్ గిల్ ముందుండి నడిపించనున్నాడు. రాబోయే ఆస్ట్రేలియా టూర్‌లో టీమిండియా కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ ఎంపికయ్యాడు. రోహిత్ శర్మ స్థానంలో జట్టు నాయకత్వ బాధ్యతలు చేపట్టనున్నాడు. శనివారం అజిత్ అగార్కర్ సారథ్యంలో సమావేశమైన సెలక్టర్లు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఆస్ట్రేలియాలో అక్టోబర్ 19 నుంచి వన్డే సిరీస్ జరగనున్న విషయం తెలిసిందే. ఇక ఈ టోర్నీలో రోహిత్ శర్మతోపాటు విరాట్ కోహ్లీ కూడా టీమిండియా తరఫున ఆడనున్నారు %ఆస్ట్రేలియా టూర్‌లో భాగంగా అక్టోబర్ 19 నుంచి 25 తేదీల మధ్య మూడు వన్డేలు జరుగనున్నాయి. ఆ తరువాత అక్టోబర్ 29 నుంచి నవంబర్ 8 వరకూ ఐదు మ్యాచుల టీ20 టోర్నీ జరగనుంది. ఇక శుభ్‌మన్ గిల్ ఇటీవలే టెస్టు క్రికెట్ జట్టు కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించాడు. ఇంగ్లండ్‌తో ఆండర్సన్-టెండుల్కర్ టెస్టు సరీస్‌ను డ్రాగా ముగించుకుని తన నాయకత్వ పటిమను రుజువు చేసుకున్నాడు. తాజాగా ముగిసిన ఆసియా కప్‌లో టీమిండియాకు సూర్యకుమార్ నేతృత్వం వహించగా గిల్ వైస్ కెప్టెన్‌గా ఉన్నాడు. భవిష్యత్తులో అన్ని ఫార్మాట్లలో జట్టుకు శుభ్‌మన్ గిల్ నేతృత్వం వహిస్తాడన్న అంచనాలూ ఉన్నాయివాస్తవానికి ఆస్ట్రేలియా టూర్‌కు




టీమిండియా కెప్టెన్‌గా రోహిత్ శర్మ ఎంపిక అవుతాడని అంతా భావించారు. అయితే, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, బీసీసీఐ సెక్రెటరీ దేవజిత్ సైకియాతో సెలక్టర్లు సుదీర్ఘంగా చర్చించారు. చివరకు శనివారం సమావేశంలో శుభ్‌మన్ గిల్‌ను వన్డే సారథిగా ఎంపిక చేశారు. ఇక ఈ సిరీస్‌ను రిషభ్ పంత్ మిస్సయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇంగ్లండ్ టూర్‌లో గాయపడ్డ నాటి నుంచీ అతడు జట్టుకు దూరంగా ఉంటున్న విషయం తెలిసిందే.

## వెస్టిండీస్‌తో తొలి టెస్టు.. టీమిండియాకు సునాయాస విజయం




ఇంటర్నెట్ డెస్క్: అహ్మదాబాద్ వేదికగా వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌లో టీమిండియా సునాయాస విజయం సాధించింది. మూడో రోజు ఆటలో ప్రత్యర్థిని 146 పరుగులకే ఆలౌట్ చేసిన భారత జట్టు 140 పరుగుల తేడాతో విజయం సొంతం చేసుకుంది. రెండో రోజు 448 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో, ఐదు వికెట్లు మిగిలుండగానే భారత్ ఇన్నింగ్స్ డిక్లేర్ చేసిన విషయం తెలిసిందే. ఫలితంగా 286 పరుగుల లక్ష్యంతో మూడో రోజును ప్రారంభించిన వెస్టిండీస్ ఆదిలోనే ఘోరంగా తడబడింది. నేడు లంచ్ సమయానికి ముందే ఐదు వికెట్లు కోల్పోయి చిక్కుల్లో పడింది లంచ్ తరువాత కూడా అదే తడబాటుకు లోనైన ప్రత్యర్థి జట్టు టీ బ్రేక్ వరకూ కూడా కొనసాగ లేక చతికిలపడిపోయింది. వెస్టిండీస్ బ్యాటర్‌లలో ముగ్గురు మాత్రమే రెండంకెల స్కోరును చేయగలిగారు. అలిక్ అథనేజ్ (38) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. జస్టిన్ గ్రీవ్స్ 25 పరుగులు చేశారు. క్యాంపెబెల్ 14 పరుగుల చేసి వెనుదిరిగాడు. ఇక టీమిండియా బౌలర్లలో రవీంద్ర జడేజా 4, మహ్మద్ సిరాజ్ 3, కుల్‌దీప్ యాదవ్ 2, వాషింగ్టన్ సుందర్ ఓ వికెట్‌ను తీశారు. ఈ టోర్నీలో ప్రస్తుతం భారత్ 1-0 ఆధిక్యాన్ని సాధించింది.

## త్రిశతక మోత



అహ్మదాబాద్: వెస్టిండీస్‌తో తొలి టెస్ట్ రెండో రోజే భారత్ పూర్తిగా పట్టు బిగించింది. ప్రత్యర్థిని మొదటి ఇన్నింగ్స్‌లో 162 పరుగులకే కూల్చిన ఆతిథ్య జట్టు..ముగ్గురు బ్యాటర్లు జురెల్ (125), జడేజా (104 బ్యాటింగ్), కేఎల్ రాహుల్ (100) శతక మోత మోగించడంతో భారీ స్కోరు చేసింది. శుక్రవారం ఆట ఆఖరికి తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లకు 448 పరుగులు సాధించింది. 286 పరుగుల ఆధిక్యం కూడగట్టుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 121/2తో భారత్ రెండోరోజు మొదటి ఇన్నింగ్స్ కొనసాగించగా, కిందటిరోజు బ్యాటర్లు గిల్, రాహుల్ విండీస్ బౌలర్లను సునాయాసంగా ఎదుర్కొన్నారు. అర్ధ శతకం సాధించిన వెంటనే కెప్టెన్ గిల్ (50) స్పిన్నర్ చేజ్ బౌలింగ్‌లో స్వీప్ షాట్ కొట్టబోయి నిష్క్రమించాడు. గిల్, రాహుల్ రెండో వికెట్‌కు 98 పరుగులు జోడించారు. మరోవైపు 57 పరుగుల వద్ద లైఫ్ దక్కించుకున్న రాహుల్ ఆపై జాగ్రత్తగా ఆడుతూ సెంచరీ పూర్తి చేశాడు. ఒక చేతితో బ్యాటు పైకెత్తి, మరో చేతి రెండు వేళ్లను నోటిలో ఉంచుకోవడం ద్వారా ఇటీవల పుట్టిన కుమార్తెకు ఈ సెంచరీని రాహుల్ అంకితమిచ్చాడు. కానీ వెంటనే స్పిన్నర్ వారికన్ బౌలింగ్‌లో రాహుల్ పెవిలియన్ చేరాడు. %జడేజా, జురెల్ ద్విశతక భాగస్వామ్యం: రక్షణాత్మక ధోరణిలో బ్యాటింగ్ చేసిన జురెల్ తొలుత మూడంకెల మార్క్ చేరుకున్నాడు. అయితే జురెల్‌ను అవుట్ చేయడం ద్వారా 206 పరుగుల ఐదో వికెట్ భాగస్వామ్యానికి లెఫ్టామ్ స్పిన్నర్ పియరీ ముగింపు పలికాడు. మరోవైపు వికెట్ స్పిన్నర్లకు అనుకూలిస్తున్నా జడేజా పరుగులు రాబట్టాడు. స్పిన్నర్ల బౌలింగ్‌లో క్రీజు బయటకు వచ్చి భారీ షాట్లతో అలరించాడు. ఈక్రమంలో అతడు శతకం పూర్తి చేశాడు. రెండోరోజు ఆట ఆఖరికి జడేజాతోపాటు సుందర్ (9 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.

3 ఒక ఇన్నింగ్స్‌లో ముగ్గురు భారత బ్యాటర్లు శతకాలు చేయడం ఈ ఏడాది ఇది మూడోసారి. గత పర్యటనలో ఇంగ్లండ్‌పై లీడ్స్, మాంచెస్టర్‌లో ఈ ఘనత సాధించారు. 10 ఓపెనర్‌గా కేఎల్ రాహుల్‌కి పదో శతకం. ఈక్రమంలో తొమ్మిది సెంచరీలు చేసిన రోహిత్‌ను దాటాడు. 80 టెస్ట్‌లలో అత్యధిక సిక్స్‌లు కొట్టిన భారత బ్యాటర్ జడేజా. ఈక్రమంలో ధోనీని (79)ని అధిగమించాడు. పంత్ (90) టాప్‌లో ఉన్నాడు. 12 సెంచరీ చేసిన 12వ భారత కీపర్ జురెల్.

## లంచ్ బ్రేక్.. బ్యాటర్లు మరోసారి విఫలం.. చిక్కుల్లో వెస్టిండీస్




ఇంటర్నెట్ డెస్క్: అహ్మదాబాద్ వేదికగా జరుగుతున్న తొలి టెస్టు మూడో రోజు ఆటలో వెస్టిండిస్ బ్యాటింగ్ లైనప్ కకావికలమైంది. భారత బౌలర్లు విజృంభించడంతో లంచ్‌కు ముందే వెస్టిండీస్ కీలక బ్యాటర్లు వెనుదిరిగారు. ఒకానొక దశలో 46 పరుగల వద్ద ఏకంగా 5 వికెట్లు జార విడుచుకుని చిక్కుల్లో పడిపోయింది %రెండో రోజున ఐదు వికెట్ల నష్టానికి 448 పరుగుల ఓవర్‌నైట్ స్కోరు సాధించిన భారత్ తన ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. విండిస్‌కు 286 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈ క్రమంలో తమ రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన వెస్టిండీస్ బ్యాటర్లు మరోసారి దారుణంగా విఫలమయ్యారు. ఆదిలోనే చంద్రాల్ తన వికెట్ సమర్పించుకోవడంతో 12 పరుగుల వద్ద విండీస్‌కు తొలి దెబ్బ తిగిలింది. సిరాజ్ బౌలింగ్‌లో నితీశ్ రెడ్డికి క్యాచ్ ఇచ్చి అతడు వెనుదిరిగాడు. ఆ తరువాత రవీంద్ర జడేజా మూడు వికెట్లు, కుల్‌దీప్ యాదవ్ మరో వికెట్ తీయడంతో విండోస్‌కు కోలుకోలేని దెబ్బ తగిలింది. లంచ్ సమయానికి వెస్టిండీస్ 5 వికెట్ల నష్టానికి కేవలం 66 పరుగులు మాత్రమే చేయగలిగింది. 220 పరుగులు మేర వెనకబడి చిక్కుల్లో పడిపోయింది.

## ఆస్ట్రేలియాలో వన్డే సిరీస్.. రంగంలోకి రోహిత్, విరాట్?

ఇంటర్నెట్ డెస్క్: టీమిండియా స్టార్ ప్లేయర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ భవితవ్యంపై చర్చ కొనసాగుతూనే ఉంది. వన్డే ఫార్మాట్‌లో ఇప్పటికీ ఇద్దరూ కొనసాగుతూనే ఉన్నారు. అయితే, అక్టోబర్ 19 నుంచి ఆస్ట్రేలియాలో జరగనున్న మూడు వన్డేల్లో రోహిత్, విరాట్ అందుబాటులో ఉండే అవకాశం ఉందని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై చర్చించేందుకు శనివారం సెలక్టర్లు సమావేశం కానున్నారు. ఇప్పటికే పలు టీమిండియా ప్లేయర్లు వివిధకారణాలతో జట్టుకు దూరంగా ఉన్నారు%గాయం కారణంగా హార్దిక్ పాండ్యా, రిషభ్ పంత్ ఆస్ట్రేలియా వన్డే సిరీస్‌కు అందుబాటులో ఉండరు. శుభ్‌మన్ గిల్ ఇప్పటికే



వరుస మ్యాచులతో అలసిపోయాడు. ఆసియా కప్ తరువాత మూడు రోజుల వ్యవధి తరువాత వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్‌లో బరిలోకి దిగాడు. దీంతో, అతడికి ఆస్ట్రేలియా టూర్ నుంచి మినహాయింపును ఇచ్చే అవకాశం కనిపిస్తుంది ఇక రోహిత్ నాయకత్వ పటిమ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పటివరకూ అతడు కెప్టెన్‌గా తక్కువ వైఫల్యాలనే ఎదుర్కొన్నాడు. ప్రస్తుతం టెస్టులు, టీ20 నుంచి రోహిత్, విరాట్ ఇద్దరూ తప్పుకున్నాడు. అంతర్జాతీయ వన్డే ఫార్మాట్‌లోనే కొనసాగుతున్నారు. ఇక ఈ సీజన్‌లో ఆరు వన్డేలు మాత్రమే ఉన్నాయి. మూడు ఆస్ట్రేలియాలో జరగనుండగా మరో మూడు న్యూజిలాండ్‌తో స్వదేశంలో జరగనున్నాయి. అయితే, వచ్చే ఏడాది జరగనున్న టీ20 వరల్డ్ కప్‌పై భారత్ దృష్టి పెట్టింది. వీలైనన్ని డబ్ల్యూటీసీ పాయింట్స్ స్కోర్ చేసేందుకు ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో బీసీసీఐ నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## విండీస్ మ్యాచులో ఆరో సెంచరీ చేసిన జడేజా.. ధోని రికార్డుతో..

వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలి టెస్ట్ మ్యాచ్‌లో టీమిండియా ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా అద్భుతమైన సెంచరీసాధించాడు. అతను కేవలం 168 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేశాడు. ఇది అతని కెరీర్‌లో ఆరో టెస్ట్ సెంచరీ. ఈ సెంచరీతో మాజీ భారత కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని రికార్డును జడేజా సమం చేశాడు. ధోని కూడా టెస్ట్ క్రికెట్‌లో ఆరు సెంచరీలు సాధించాడు.ఇప్పుడు జడేజా దృష్టి లెజెండరీ వికెట్ కీపర్-బ్యాట్స్‌మన్ రిషబ్ పంత్ రికార్డుపై ఉంది. పంత్ టెస్ట్ క్రికెట్‌లో ఏడు సెంచరీలు సాధించాడు. జడేజా ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి కసరత్తు చేస్తున్నాడు.ఈ ఘనతతో మహేంద్ర సింగ్ ధోని రికార్డును జడేజా సమం చేశాడు. ధోని కూడా ఆరు టెస్ట్ సెంచరీలు చేశాడు, కానీ జడేజా సిక్సర్ల పరంగా భారత మాజీ కెప్టెన్‌ను అధిగమించాడు. జడేజా ఇప్పటివరకూ 7,213 బంతులను ఎదుర్కొని 78 సిక్సర్లు చేశాడు.మహేంద్ర సింగ్ ధోని 8,104 బంతుల్లో 76 సిక్సర్లు బాదాడు. దీంతో జడేజా టెస్ట్ క్రికెట్‌లో అత్యధిక సిక్స్ హిట్టర్ల జాబితాలో నాలుగో స్థానంలో నిలిచాడు. వీరేంద్ర సెహ్వాగ్ 91, రిషబ్ పంత్ 90, సిక్సర్లతో అగ్రస్థానంలో ఉన్నారు. రోహిత్ శర్మ 88 సిక్సర్లతో మూడో స్థానంలో కలడు.

మూడో రోజు ఎలా..రవీంద్ర జడేజా తన సెంచరీ పూర్తి చేసిన కొన్ని నిమిషాలకే




అహ్మదాబాద్ టెస్ట్ మ్యాచ్ రెండో రోజు ఆట ముగిసింది. భారత్ 5 వికెట్ల నష్టానికి 448 పరుగులు చేసి, తమ ఆధిక్యాన్ని 286 పరుగులకు పెంచుకుంది. క్రీజులో వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా ఉన్నారు.

గిల్ అర్ధశతకంతో ఆకట్టుకోగా.. కేఎల్ రాహుల్, ధృవ్ జురేల్, జడేజా శతకాలు.. స్కోర్ పెరిగేందుకు సపోర్టుగా నిలిచాయి. వెస్టిండీస్ బౌలర్లు పెద్దగా ప్రభావాన్ని చూపలేకపోయారు.

## ఆరు బంతుల్లో 6 ఫోర్లు.. 21 ఏళ్ల బ్యాట్స్‌మన్ ప్రపంచ రికార్డ్

జింబాబ్వే బ్యాట్స్‌మన్ 21 ఏళ్ల బ్రియాన్ బెన్నెట్ 72 గంటల్లోనే రెండు ప్రపంచ రికార్డులు సృష్టించి అరుదైన ఘనతను సాధించాడు. అక్టోబర్ 2న టీ20 ప్రపంచ కప్ 2026 అర్హత మ్యాచ్‌లో కెన్యాపై అరుదైన రికార్డును నెలకొల్పాడు. టీ20 ఇంటర్నేషనల్‌లో ఆరు బంతుల్లో ఆరు ఫోర్లు కొట్టిన మొదటి బ్యాట్స్‌మన్‌గా బ్రియాన్ బెన్నెట్ నిలిచాడు. %ప్రపంచ కప్ క్వాలిఫైయర్ రెండో సెమీఫైనల్‌లో జింబాబ్వే ఇన్నింగ్స్‌లోని నాలుగో ఓవర్‌లో 21 ఏళ్ల యువ ఆటగాడు ఈ ఘనతను సాధించాడు. లూకాస్ ఒలుయోచ్ కెన్యా




బౌలర్‌పై ఆరు బంతుల్లో ఆరు ఫోర్లు కొట్టి ఈ రికార్డ్ క్రియేట్ చేశాడు.కెన్యా మొదట బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 6 వికెట్లకు 122 పరుగులు చేసింది. జింబాబ్వే తరఫున బ్రియాన్ బెన్నెట్ బెస్ట్ ఇన్నింగ్స్ ఇచ్చాడు.

# బిజినెస్



## వామ్మో.. మళ్లీ పసిడి, వెండి ధరల్లో పెరుగుదల .. నేటి రేట్స్ ఇవీ



ఇంటర్నెట్ డెస్క్: బంగారు నగలు కొనుగోలు చేయాలనుకునే వారికో అలర్ట్. నిన్నటితో పోలిస్తే నేటి పసిడి ధరల్లో పెరుగుదల చోటు చేసుకుంది. ప్రస్తుతం 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.870 మేర పెరిగి రూ.1,19,400 వద్ద కదలాడుతోంది. ఇక 22 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,09,450కు పెరిగింది. 18 క్యారెట్ పది గ్రాముల బంగారం ధర రూ. 8,955గా ఉంది. ఇక కిలో వెండి భారీగా పెరిగి రూ.1,55,000 వద్ద కొనసాగుతోంది. 10 గ్రాముల ప్లాటినం ధర కూడా రూ.45,760కు పెరిగింది నేటి ట్రేడింగ్ సెషన్ ముగిశాక ధరల పెరుగుదలపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## జన్‌ధన్ ఖాతాదారులకు బిగ్ అలర్ట్




న్యూఢిల్లీ, అక్టోబర్ 03: జన్‌ధన్ యోజన ద్వారా బ్యాంక్ అకౌంట్లు పొందిన ఖాతాదారులకు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియ కీలక సూచన చేసింది. ఈ ఖాతాలకు రీ కేవైసీ చేయాల్సి ఉందని స్పష్టం చేసింది. ఈ రీకేవైసీకి సెప్టెంబర్ 30వ తేదీ వరకు గడువు విధించినట్లు వెల్లడించింది. ఈ క్రమంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు పంచాయతీ స్థాయిలో రీ కేవైసీ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు.. వాటిని వినియోగించుకోవాలని ఆర్‌బీఐ సూచించింది. ఈ క్యాంపుల్లో రీ కేవసీతోపాటు మైక్రో ఇన్సూరన్స్, పెన్షన్ పథకాలపై సైతం దృష్టి సారించినట్లు వెల్లడించింది. ఇంతకీ రీకేవైసీ అంటే ఏమిటంటే..రీ కేవైసీ అనేది ఖాతాదారుల వ్యక్తిగత వివరాలు, చిరునామా తదితర అంశాలను అప్‌డేట్ చేసే ప్రక్రియ. మీ కేవేసీ గడువు తేదీ ముగిసినా లేదా మీకు సంబంధించిన వివరాలు మారినా.. నిబంధనల ప్రకారం బ్యాంక్‌కు తాజా సమాచారం అందించాల్సి ఉంటుంది. ఈ జన్‌ధన్ ఖాతాలు తెరిచి 10 ఏళ్లు పూర్తయింది. ఈ నేపథ్యంలో ఈ రీకేవైసీ ప్రక్రియన చేపడుతున్నారు. ఈ సదుపాయాన్ని ఆయా క్యాంపుల్లో వినియోగించుకోవచ్చు. అలాగే ఆన్‌లైన్‌లోనూ రీకేవైసీని పూర్తి చేసే సౌకర్యాన్ని ఆర్‌బీఐ కల్పించింది. అత్యధిక ఖాతాలు.. ఆ బ్యాంకులోనే..అయితే ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ఒకటైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)లో జన్‌ధన్ ఖాతాలు అత్యధిక సంఖ్యలో ఉన్నాయి. మీ జన్‌ధన్ ఖాతా ఈ బ్యాంకు శాఖలో ఉన్నట్లు అయితే.. ఆన్‌లైన్‌లోనూ రీ కేవైసీ చేసుకునే వెసులుబాటును కల్పించింది. అందుకోసం ఎస్‌బీఐ నెట్ బ్యాంకింగ్ ద్వారా లాగిన్ కావాల్సి ఉంది.

ఇంతకీ జన్‌ధన్ ఖాతాలు అంటే ఏమిటీ?

2014లో ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో ఎన్డీయే ప్రభుత్వం కొలువు తీరింది. దీంతో నిరుపేద భారతీయులకు సైతం బ్యాంకు ఖాతా సౌకర్యం కల్పించాలనే ఉదేశ్యంతో ప్రధాన మంత్రి జన్‌ధన్ యోజన పథకానికి ప్రధాని మోదీ శ్రీకారం చుట్టారు. దేశంలో ప్రతి కుటుంబానికి ఒక్క బ్యాంకు ఖాతా ఉండాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ ఖాతాల ద్వారా ప్రజలు భద్రంగా తమ నగదును పొదుపు చేసుకోవడం, బ్యాంకు రుణాలు పొందడం సులభతరం చేసింది. ఈ ఖాతాల్లో పైసా నగదు లేకుండా నిర్వహించుకునే వెసులుబాటును సైతం కల్పించింది. ఇటీవల ఈ ఖాతాలు ఉన్న ఖాతాదారులకు చెక్కు సౌకర్యాన్ని సైతం కల్పించారు.

## మార్కెట్‌కు ఆర్‌బీఐ జోష్

ముంబై: ఈక్విటీ మార్కెట్లో ఆర్‌బీఐ పాలసీ ఉత్తేజం నింపింది. వడ్డీరేట్లు యథాతథంగా కొనసాగించడంతో పాటు ఈ ఏడాదికి వృద్ధిరేటు అంచనాను 6.8 శాతానికి పెంచడం సెంటిమెంట్ బలపడేందుకు దోహదపడింది. దీనికి తోడు ప్రపంచ మార్కెట్లలో సానుకూల ధోరణులు, క్రూడాయిల్ ధరల తగ్గుదలతో ఇన్వెస్టర్లు తక్కువ రేట్లకు అందుబాటులో ఉన్న నాణ్యమైన షేర్ల కొనుగోలుకు ఉత్సా హం చూపారు. ప్రధానంగా వడ్డీరేట్ల ప్రభావానికి లోనయ్యే రంగాల షేర్లు లాభాల బాట పట్టాయి. ఎనిమిది రోజుల వరుస నష్టాలకు తెర దించిన సెన్సెక్స్ 715.69 పాయింట్ల లాభంతో 80,893.31 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 225.20 పాయింట్ల లాభంతో 24,836.30 వద్ద ముగిసింది. ప్రధానంగా బ్యాంకింగ్, ఆటో, రియల్టీ కౌంటర్లలో కొనుగోళ్లు జోరుగా సాగాయి. బ్యాంకెక్స్ 1.44% లాభపడి 62,401.58 పాయింట్లకు చేరింది. ఆటో ఇండెక్స్ 0.74%, రియల్టీ ఇండెక్స్ 1.11% వృద్ధిని నమోదు చేశాయి. రంగాల వారీ సూచీలన్నీ కూడా లాభాల్లో ముగిశాయి.%అమెరికన్ డాలర్ మారకంలో రూపాయి జీవితకాల కనిష్ట స్థాయిల నుంచి 9 పైసలు కోలుకుని 88.71 వద్ద ముగిసింది. మంగళవారం విదేశీ ఇన్వెస్టర్లు రూ.2,327 కోట్ల విలువ గల షేర్లను విక్రయించారు.

ఎల్‌జీ ఇష్యూ ధర శ్రేణి రూ.1080–1140

ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఈ నెల 7వ తేదీన ప్రారంభించనున్న రూ.11,607 కోట్ల విలువ గల ఐపీఓలో షేరు ధర శ్రేణిని రూ.1080–రూ.1140గా ప్రకటించింది.

పసిడి ధర రూ.1,21,100

న్యూఢిల్లీ: బులియన్ మార్కెట్‌లో ర్యాలీ కొనసాగుతోంది. బుధవారం ఢిల్లీలో 10 గ్రాములు మేలిమి (24 కేరట్స్) బంగారం ధర రూ.1,100 పెరిగి రికార్డు స్థాయిలో రూ.1,21,100కు చేరింది. కిలో వెండి ధర మాత్రం ఎదుగూ బొదుగు లేకుండా రూ.1,50,500 వద్ద కొనసాగింది. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఔన్స్ (31.10 గ్రాములు) పసిడి ధర 3,895.33 డాలర్లకు చేరి సరికొత్త రికార్డు నమోదు చేసింది.నేడు సెలవుదసరా పర్వదినం, గాంధీ జయంతిని పురస్కరించుకుని గురువారం మార్కెట్లకు సెలవు. ఈక్విటీ, బులియన్, ఫారెక్స్, కమోడిటీ మార్కెట్లు పనిచేయవు.

## నవరాత్రి అమ్మకాల జాతర



న్యూఢిల్లీ: గురువారంతో ముగిసిన దసరా నవరాత్రులు విభిన్న రంగాలకు చెందిన కంపెనీలకు హర్షాతిరేకాన్ని పంచాయి. నిత్యావసర వస్తువులతో పాటు ఆటోమొబైల్, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, వినియోగ వస్తువుల కంపెనీలు రికార్డు అమ్మకాలు నమోదు చేశాయి. గత నెల 22 నుంచి అమలులోకి వచ్చి న జీఎసటీ రేట్ల తగ్గింపు పండుగ కొనుగోళ్లకు కొత్త ఉత్తేజం అందించిందని కంపెనీలు చెబుతున్నాయి. దీనికి తోడు బడ్జెట్లో ప్రకటించిన ఆదాయపు పన్ను మార్పులు కూడా వినియోగవృద్ధికి దోహదపడ్డాయి. జీఎసటీ రేట్లు అమలులోకి వచ్చిన తొలి రోజు నుంచే ప్రజలు తమకు కావలసిన వస్తువులు, గృహోపకరణాలు, కార్ల కొనుగోలుకు పరుగు లు తీసినట్టు మార్కెట్ వర్గాలు తెలిపాయి. ఈ ఏడాదిలో విలువ, పరిమాణంపరంగా రెండంకెల వృద్ధికి ఈ అమ్మకాలు దోహదపడతాయని పలు కంపెనీలు భావిస్తున్నాయి. కేరళలో ఓనం నుంచి ప్రారంభమై దీపావళితో ముగిసే 45 రోజుల పండుగల సీజన్‌లో మిగిలిన రోజుల్లో కూడా ఇదే ఉత్సాహం కొనసాగవచ్చునని ఆశ పడుతున్నాయి. కార్ల దిగ్గజం మారుతి పదేళ్ల కాలంలో గరిష్ఠ అమ్మకాలు నమోదు చేసింది. నవరాత్రి తొలి ఎనిమిది రోజుల కాలంలో 1.65 లక్షల కార్లను విక్రయించింది. గత ఏడాది నవరాత్రి పర్వదినాల్లో కంపెనీ 85 వేల కార్లు మాత్రమే విక్రయించింది. ఈ సీజన్‌లో 2 లక్షల అమ్మకాల మైలురాయి చేరగలమన్న ఆశతో ఉంది. దీనికి తోడు ప్రస్తుతం కంపెనీ చేతిలో రెండున్నర లక్షల బుకింగ్‌లున్నాయి. కాగా సెప్టెంబర్ నెలలో తమ ఉత్పత్తి 26% పెరిగి 2,01,915 యూనిట్లకు చేరినట్టు మారుతి తెలిపింది. గత ఏడాది ఇదే నెలలో సంస్థ 1,59,743 యూనిట్లు ఉత్పత్తి చేసింది. కాంపాక్ట్ కార్లు, యుటిలిటీ వెహికల్స్, ఎంట్రీ లెవెల్ మోడళ్లకు పెరుగుతున్న డిమాండ్ కారణంగా ఈ వృద్ధి సాధ్యమైందని కంపెనీ తెలిపింది. టాటా మోటార్స్, మహీంద్రా, హ్యుండయ్ కంపెనీలు కూడా భారీ అమ్మకాలు నమోదు చేసినట్టు ప్రకటించాయి.

పెద్ద స్క్రీన్ టీవీలపై మోజు

కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ రంగంలోని ఎల్‌జీ, హేయర్, గోద్రెజ్ అప్లయెన్సెస్ కూడా గత నవరాత్రితో పోల్చితే ఈ సీజన్‌లో భారీగా రెండంకెల అమ్మకాల వృద్ధిని నమోదు చేసినట్టు ప్రకటించాయి. తగ్గిన జీఎసటీ రేట్లను పరిగణనలోకి తీసుకుని ఇప్పటివరకు చిన్న తెర టీవీలను వినియోగిస్తున్న వారు పెద్ద స్క్రీన్ టీవీలు కొనేందుకు ఆసక్తి చూపారు. అలాగే ఇంధన సామర్థ్యం గల ఎయిర్ కండిషనర్లు కొనుగోలు చేశారు. రెండున్నర లక్షలకు పైగా ధర గల 85–100 అంగుళాల టీవీలు భారీగా అమ్ముడుపోయినట్టు హేయర్ ప్రకటించింది. దేశంలోని అతి పెద్ద రిటైలర్ రిలయన్స్ రిటైల్ అమ్మకాలు 20–25% పెరిగినట్టు తెలుస్తోంది. విజయ్ ఎలక్ట్రానిక్స్ అమ్మకాలు సైతం 20% పెరిగాయి.

## మన ఆర్థికం పటిష్ఠం




న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా పలు ఆటుపోట్లున్నప్పటి కీ మన ఆర్థిక వ్యవస్థకు ఎలాంటి ఢోకా లేదని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ భరోసా ఇచ్చారు. ప్రస్తుతం మన ఆర్థిక వ్యవస్థ, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు స్థిరీకరణ శక్తిలా మారిందన్నారు. గత పదేళ్లుగా ప్రభుత్వం చేపట్టిన చర్యలతో మన ఆర్థిక వ్యవస్థ ఎలాంటి సవాళ్లనైనా తట్టుకునే స్థితికి చేరిందన్నారు. ఢిల్లీలో జరుగుతున్న 'కౌటిల్య ఎకనామిక్ కాన్‌క్లేవ్, 2025' సదస్సులో సీతారామన్ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశీయ వినియోగం, పెట్టుబడులే మన ఆర్థిక వ్యవస్థకు శ్రీరామరక్షగా మారాయన్నారు. పలు సానుకూల అంశాలున్నా ఎలాంటి అలసత్వానికి తావు లేదని హెచ్చరించారు. ఆర్థిక ఆంక్షలు, సుంకాలు, పెరుగుతున్న అంతర్జాతీయ ఉద్రిక్తతలు అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలను మార్చివేస్తున్న విషయాన్ని ఆమె గుర్తు చేశారు. ప్రస్తుత ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ఆమె గతంలో ఎన్నడూ లేని అనిశ్చితి, ఆటుపోట్ల యుగమని ఆమె అభివర్ణించారు.ప్రైవేటు పెట్టుబడులు: పెరుగుతున్న వ్యాపారావకాశాలతో ప్రైవేటు రంగం పెట్టుబడులపై దృష్టి కేంద్రీకరించిందని, ముఖ్యంగా ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్య (పీపీ పీ) ప్రాజెక్టులపైర్రఆసక్తి చూపిస్తోందని చెప్పారు. గత ఐదేళ్లలో తమ ప్రభుత్వం ఏటికేటికీ ప్రభుత్వ మూల ధన పెట్టుబడులను పెంచుకుంటూ పోతున్న విషయాన్ని ఆమె గుర్తు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం రూ.11.21 లక్షల కోట్ల ప్రభుత్వ పెట్టుబడుల లక్ష్యానికి కట్టుబడి ఉన్నట్టు తెలిపారు.

## పాత రూల్స్‌కు గుడ్‌బై.. అక్టోబర్ 4 నుంచి చెక్ క్లియరెన్స్‌కు కొత్త విధానం

చెక్ క్లియరెన్స్ విషయంలో అక్టోబర్ 4, 2025 నుంచి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్త నిబంధనలను అమలు చేయనుంది. ఈ కొత్త విధానం ద్వారా చెక్‌లు కేవలం కొన్ని గంటల్లోనే క్లియర్ అవుతాయి. గతంలో చెక్‌లు క్లియర్ కావడానికి రెండు పని దినాలు పట్టేవి. కానీ, అక్టోబర్ 4 నుంచి అమలులోకి వచ్చే కొత్త విధానంతో, ఒకే రోజులో కొన్ని గంటల్లోనే మీ చెక్ క్లియర్ అవుతుంది.ఈ విధానం చెక్ ట్రంకేషన్ సిస్టమ్ (ధారంగా పనిచేస్తుంది. %జూ%లో చెక్‌ను భౌతికంగా బ్యాంకుకు పంపాల్సిన అవసరం లేదు. చెక్ ఫొటో వివరాలు డ్రాయీ బ్యాంకుకు పంపబడతాయి. దీని వల్ల క్లియరెన్స్ వేగవంతం అవుతుంది.బ్యాంక్, బ్యాంక్ వంటి ప్రైవేట్ బ్యాంకులు ఈ మార్పును స్వాగతిస్తూ, తమ కస్టమర్లకు కొత్త విధానాల గురించి సమాచారం అందిస్తున్నాయి.చెక్‌ల భద్రతను పెంచడానికి %=దీ×% పాజిటివ్ పే సిస్టమ్‌ను తప్పనిసరి చేసింది. ఈ విధానంలో రూ.50,000 కంటే ఎక్కువ విలువైన చెక్‌ల కోసం కస్టమర్లు ముందుగానే కొన్ని వివరాలు బ్యాంకుకు సమర్పించాలి. వాటిలో అకౌంట్ నంబర్, చెక్ నంబర్, చెక్ తేదీ, చెక్ మొత్తం లబ్ధిదారుడి పేరు తెలియజేయాలి. ఈ వివరాలను చెక్ డిపాజిట్ చేయడానికి కనీసం 24 పని గంటల ముందు బ్యాంకుకు ఈ–మెయిల్ ద్వారా పంపించాలి.బ్యాంక్ వాటిని ధృవీకరించిన తర్వాత చెక్ వివరాలు సరిపోలితే క్లియర్ అవుతుంది. ఒకవేళ వివరాలు సరిపోలకపోతే చెక్ తిరస్కరించబడుతుంది. మీరు మళ్లీ వివరాలను సమర్పించాల్సి ఉంటుంది. రూ.5లక్షల కంటే ఎక్కువ విలువైన చెక్‌లకు పాజిటివ్ పే సిస్టమ్ తప్పనిసరి. అయితే రూ.50,000 పైన ఉన్న చెక్‌లకు దీనిని ఉపయోగించమని బ్యాంకులు సిఫార్సు చేస్తున్నాయి.

చెక్ బౌన్స్ కాకుండా జాగ్రత్తలు

చెక్ బౌన్స్ కాకుండా ఉండాలంటే మీ బ్యాంక్ ఖాతాలో తగినంత బ్యాలెన్స్ ఉ




ంచుకోవాలి. అలాగే, చెక్‌లోని వివరాలను కూడా జాగ్రత్తగా నింపాలి.

మొత్తాన్ని అక్షరాల్లో, అంకెల్లో సరిగ్గా రాయాలి.

చెక్ తేదీ సరైనదిగా ఉందో లేదో చూసుకోవాలి.

లబ్ధిదారుడి పేరు, మొత్తంలో ఎలాంటి దిద్దుబాట్లు ఉండకూడదు.

మీ సంతకం బ్యాంక్ రికార్డులతో సరిపోలాలి.

ఈ చిన్న జాగ్రత్తలు మీ చెక్ తిరస్కరణను నివారిస్తాయి.

కొత్త విధానం దశలు

%=దీ×% ఈ కొత్త విధానాన్ని రెండు దశల్లో అమలు చేయనుంది. మొదటి దశ అక్టోబర్ 4, 2025 నుంచి మొదలవుతుంది. రెండో దశ జనవరి 3, 2026 నుంచి అమలు చేయనున్నారు. ఈ కొత్త విధానం చెక్ క్లియరెన్స్‌ను వేగవంతం చేయడమే కాకుండా, మీ లావాదేవీలను మరింత సురక్షితం చేస్తుంది. కస్టమర్లు తమ చెక్ వివరాలను జాగ్రత్తగా నింపడం, పాజిటివ్ పే సిస్టమ్‌ను ఉపయోగించడం ద్వారా పూర్తి ప్రయోజనాన్ని పొందవచ్చు.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006